



Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 185 | గురువారం 25 డిసెంబర్ 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


# ‘బాహుబలి’ విజయవంతం

- నింగిలోకి ‘బ్లూ బర్డ్ బ్లాక్ 2’ ఉపగ్రహం
- కమ్యూనికేషన్ రంగంలో విప్లవాత్మక మార్పులు
- భవిష్యత్తులో మరిన్ని వాణిజ్య ప్రయోగాలు : ఇస్రో చైర్మన్




**సూళ్లూరుపేట - సూర్య వాస్తవం, డిసెంబర్ 24**

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో మరో చరిత్ర సృష్టించింది. వాణిజ్య ప్రయోగాల్లో కీలక మైలురాయిని అందుకుంది. అమెరికాకు చెందిన ‘బ్లూ బర్డ్ 2’ భారీ ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి విజయవంతంగా పంపింది. బుధవారం ఉదయం 8.55 గంటలకు శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం రెండో ప్రయోగ వేదిక నుంచి ఎల్‌విఎం3 ఎం6 రాకెట్ ద్వారా ఈ వాణిజ్య ఉపగ్రహాన్ని ప్రయోగించింది. అమెరికాకు చెందిన భారీ కమ్యూనికేషన్ ఉపగ్రహం బ్లూ బర్డ్ బ్లాక్ 2ను రాకెట్ విజయవంతంగా మోసుకెళ్లింది. 15.30 నిమిషాల్లో మూడు దశల్లో రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. అమెరికాకు చెందిన ఎఎస్‌టి స్పేస్ మొబైల్ సంస్థతో కలిసి ఇస్రో వాణిజ్య విభాగం న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ ఈ ప్రయోగాన్ని నిర్వహించింది. సుమారు 6,100 కిలోల బరువున్న ఈ ఉపగ్రహం ఇస్రో ఇప్పటివరకు ప్రయోగించిన అత్యంత బరువైన

- మిగతా 2లో..



నేను రాజకీయాల్లో ఉన్నంత వరకు

## కల్వకుంట్ల కుటుంబాన్ని అధికారంలోకి రానివ్వను..

- ఇదే నా శపథం: రేవంత్ రెడ్డి
- కొడంగల్ బిడ్డగా ఇదే గడ్డ మీది నుంచి చెబుతున్నానని సవాల్
- బీఆర్ఎస్ గతం కాంగ్రెస్ భవిష్యత్తు అన్న రేవంత్ రెడ్డి - కేసీఆర్ నన్ను జైలుకు పంపించి నా కుటుంబ సభ్యులను ఇబ్బంది పెట్టాడని వ్యాఖ్య

2లో

# 20 లక్షల ఉద్యోగాలే లక్ష్యం

- స్వర్ణాంధ్ర 2047 లక్ష్య సాధనపై సీఎం చంద్రబాబు సమీక్ష
- 20 లక్షల ఉద్యోగాల కల్పనే మొదటి ప్రాధాన్యత అని స్పష్టీకరణ
- పది సూత్రాలను పది మిషన్లుగా అమలు చేయాలని అధికారులకు ఆదేశం
- నీటి భద్రత, వ్యవసాయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచన
- ‘మేడ్ ఇన్ ఆంధ్ర’ బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తం చేయాలని దిశానిర్దేశం



**అమరావతి- సూర్య వాస్తవం, డిసెంబర్ 24**

స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్య సాధన కోసం రూపొందించిన పది సూత్రాలను పది మిషన్లుగా స్వీకరించి పనిచేయాలని సీఎం చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. పాలనలో వేగాన్ని పెంచి, ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు ప్రతి ప్రభుత్వ శాఖ పనితీరును తెలిపే ప్రత్యేక సూచికలను (ఇండికేటర్లు) సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. సచివాల యంలో ఇవాళ ఆయన స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలు, పది సూత్రాల అమలుపై నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే అత్యంత ప్రాధాన్యతాంశమని స్పష్టం చేశారు. నైపుణ్యం పోర్టల్ ద్వారా ఉద్యోగాల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలని సూచించారు. జీరో పావర్టీ మిషన్‌లో భాగంగా రాష్ట్రంలోని 30 లక్షల పేద కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా కలిగే ప్రయోజనాన్ని అంచనా వేయాలని, ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యమన్నారు. నీటి భద్రతను కీలక మిషన్‌గా పరిగణించి, నీటి వనరుల సమర్థ

- మిగతా 2లో..



ప్రతి నెలా జీతంలో

## రూ.ఐదు వేలు విద్యార్థికి సాయం

- ఇప్పటంలో పర్యటించిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- వృద్ధురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

**తాడేపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 24**

ప్రతిపక్ష నేతగా పవన్ కల్యాణ్ గతంలో ఇప్పటం గ్రామంలో పర్యటించినప్పుడు ఓ వృద్ధురాలికి ఇచ్చిన మాటను, నేడు అధికారంలోకి వచ్చాక ఉప ముఖ్యమంత్రి హోహెూదాలో నిలబెట్టుకున్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఇప్పటం గ్రామంలో నివసిస్తున్న

- మిగతా 2లో..

వైఎస్.జగన్‌కు

## అస్వస్థత

- నేటి కార్యక్రమాలు రద్దు
- నేడు క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనున్న మాజీ సీఎం



**పులివెందుల- సూర్య వాస్తవం, డిసెంబర్ 24**

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జ్వరం రావడంతో డాక్టర్ల సలహాలు మేరకు బుధవారం కార్యక్రమాలను రద్దు చేసుకున్నారు.

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి



రుషికొండ నిర్మాణాలపై

## మరో రెండు ఫ్లోర్లు వేసుకోవచ్చు

- మంత్రిపయ్యావుల కేశవ్
- రుషికొండ ప్యాలెస్ వినియోగంపై సబ్ కమిటీ భేటీ
- హాస్పిటాలిటీ ఇండస్ట్రీ కోసం వినియోగించే అంశాన్ని పరిశీలించామన్న కేశవ్
- గత వైసీపీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన కందుల దుర్గేశ్




# 'బాహుబలి' విజయవంతం

(మొదటిపేజీ తరువాయి)

వాణిజ్య పేలోడ్‌గా రికార్డు సృష్టించింది. రాకెట్ ప్రయోగం విజయవంతం కావడంతో షార్‌లో సంబరాలు చేసుకున్నారు.

**కమ్యూనికేషన్ రంగంలో విప్లవాత్మక మార్పులు**

ఈ ప్రయోగం ప్రపంచ కమ్యూనికేషన్ రంగంలో విప్లవాత్మక మార్పులకు బాటలు వేసింది. బ్లూ బర్డ్ బ్లాక్-2 ఉపగ్రహం ద్వారా 4జీ/5జీ సిగల్స్ అందుతాయి. దీనివల్ల ఎటువంటి సిగల్స్ లేని మారుమూల ప్రాంతాల్లో కూడా మొబైల్ సేవలు పొందే వీలుంటుంది. ఆర్బిట్‌లో అతి పెద్ద వాణిజ్య ఉపగ్రహంగా గుర్తింపు పొందిన దీని యాంటీనా విచ్చుకున్న తర్వాత ఏకంగా 223 చదరపు మీటర్ల వైశాల్యం కలిగి ఉంటుంది. ఈ విజయంతో అంతర్జాతీయ వాణిజ్య అంతరిక్ష మార్కెట్లో భారత్ మరోసారి తన సత్తా చాటింది.

**శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపిన ఇస్రో చైర్మన్**

భవిష్యత్తులో మరిన్ని వాణిజ్య ప్రయోగాలు చేపడతామని ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ తెలిపారు. శ్రీహరికోటలోని మీడియా సెంటర్‌లో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మానవ రహిత ప్రయోగాలు, నావిగేషన్, ఎయిర్ స్పేస్ స్టేషన్, వీనస్ ఆర్బిట్ ప్రయోగాలు, వాణిజ్య ఒప్పందాలు జరుగుతాయని తెలిపారు. ప్రయోగం విజయవంతం కావడానికి అహర్నిశలు కృషి చేసిన శాస్త్రవేత్తలను ఆయన అభినందించారు.

# 20 లక్షల ఉద్యోగాలే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

వినియోగంపై దృష్టి పెట్టాలని సీఎం చంద్రబాబు తెలిపారు. నీటి ఆడిట్ నిర్వహించాలని, వివాదాలకు తావులేకుండా చూడాలని అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు సస్యశ్యామలంగా ఉండాలన్నదే తన ఆకాంక్ష అని పేర్కొన్నారు. రైతుల ఆత్మహత్యల నివారణకు పటిష్టమైన కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు.

'మేడ్ ఇన్ ఆంధ్ర' బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తంగా ప్రోత్సహించాలని, అరకు కాఫీ తరహాలో రాష్ట్ర ఉత్పత్తులకు నాణ్యతతో కూడిన గుర్తింపు తీసుకురావాలని సీఎం సూచించారు. రవాణా వ్యయాన్ని తగ్గించేందుకు లాజిస్టిక్స్ మాస్టర్ ప్లాన్, స్వర్ణాంధ్ర కోసం సర్క్యులర్ ఎకానమీ, సాంకేతికత వినియోగంతో పౌర సేవలను సులభతరం చేయడం వంటి అంశాలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రతి నెలా జీతంలో రూ.ఐదు వేలు విద్యార్థికి సాయం

(మొదటిపేజీ తరువాయి)

ఇండ్ల నాగేశ్వరమ్మ కుటుంబ సభ్యులతో కలసి బుధవారం మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో రోడ్డు విస్తరణ పేరుతో పలు ఇళ్లను కూల్చి వేశారు. ఆ సమయంలో పవన్ కల్యాణ్ గ్రామంలో పర్యటించి బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆ సందర్భంగా ఇండ్ల నాగేశ్వరమ్మ అనే బాధితురాలు.. ఎన్నికల్లో గెలిచి పెద్ద పదవిలో ఉన్నపుడు మళ్లీ మా ఇంటికి రావాలని పవన్‌ను కోరారు. ఇప్పుడు ఉప ముఖ్యమంత్రి హోదాలో ఇప్పటం గ్రామంలోని నాగేశ్వరమ్మను కలిసి ఆమెకు రూ. 50 వేలు, ఆమె మనవడి చదువు నిమిత్తం లక్ష రూపాయల నగదును అందించారు. నాగేశ్వరమ్మ మనవడి విద్యాభ్యాసం కోసం ప్రతి నెలా తన వేతనం నుంచి రూ. ఐదు వేలు అందజేస్తానని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నాగేశ్వరమ్మ మాట్లాడుతూ పవన్ పర్యటనపై నాగేశ్వరమ్మ భావోద్వేగానికి లోనయ్యారు. "ఇచ్చిన మాట ప్రకారం పవన్ బాబు మా ఇంటికి రావడం చాలా సంతోషంగా ఉంది. మా ఇంటి పెద్ద కొడుకులా వచ్చి ఆప్యాయంగా పలకరించారు.

నా ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. మా కుటుంబానికి కొండంత అండగా ఉంటామని భరోసా ఇచ్చారు" అని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు చిల్లపల్లి శ్రీనివాసరావు, గంజి, చిరంజీవి, జనసేన తాడేపల్లి మండల అధ్యక్షులు సామల నాగేశ్వరరావు, జనసేన తాడేపల్లి పట్టణ అధ్యక్షులు అంబటి తిరుపతిరావు, టిడిపి తాడేపల్లి మండల అధ్యక్షులు దాసరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్.జగన్‌కు అస్వస్థత

(మొదటిపేజీ తరువాయి)

పులివెందులలో మూడు రోజుల పర్యటనలో భాగంగారెండవ రోజు ఇడుపులపాయలో ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని, పట్టణ పరిధిలోని వైసిపి శ్రేణులతో ప్రత్యేక సమావేశం నిర్వహించాల్సి ఉంది. జ్వరం రావడంతో అన్ని కార్యక్రమాలను రద్దు చేసుకుని పులివెందులలోని తన నివాసంలో విశ్రాంతి తీసుకున్నారు. గురువారం క్రిస్మస్ సందర్భంగా పట్టణంలోని సిఎస్ఐ చర్చిలో జరిగే క్రిస్మస్ వేడుకల్లో కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. అనంతరం ఆయన హెలికాప్టర్‌లో బెంగళూరుకు బయలుదేరి వెళతారు.

# నేను రాజకీయాల్లో ఉన్నంత వరకు కల్వకుంట్ల కుటుంబాన్ని అధికారంలోకి రానివ్వను..

- ఇదే నా శపథం: రేవంత్ రెడ్డి
- కొడంగల్ బిడ్డగా ఇదే గడ్డ మీద నుంచి చెబుతున్నానని సవాల్
- బీఆర్ఎస్ గతం కాంగ్రెస్ భవిష్యత్తు అన్న రేవంత్ రెడ్డి - కేసీఆర్ నన్ను జైలుకు పంపించి నా కుటుంబ సభ్యులను ఇబ్బంది పెట్టాడని వ్యాఖ్య

**హైదరాబాద్ - సూర్య వాస్తవం, డిసెంబర్ 24**

కొడంగల్ బిడ్డగా ఇదే గడ్డ మీది నుంచి ఒక మాట చెబుతున్నానని, తాను రాజకీయాల్లో ఉన్నంత వరకు కేసీఆర్ సహా కల్వకుంట్ల కుటుంబాన్ని అధికారంలోకి రానివ్వనని, ఇదే తన శపథమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నారాయణపేట జిల్లా కోస్గిలో ఏర్పాటు చేసిన సర్పంచ్‌ల సన్మాన సభలో ఆయన మాట్లాడుతూ, కేసీఆర్‌ను మళ్లీ అధికారంలోకి రానివ్వనని, ఇదే తన సవాల్ అన్నారు. ఇక బీఆర్ఎస్ గతమేనని, భవిష్యత్తు కాంగ్రెస్ మాత్రమే అన్నారు. 2029 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 80కి పైగా సీట్లు సాధిస్తుందని, నియోజకవర్గాల పునర్విభజన జరిగి 153 అయితే 100కు పైగా స్థానాలు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. "రాసిపెట్టుకోండి. రెండోసారి కాంగ్రెస్ పాలనను తీసుకువస్తాం. ఇదే నా సవాల్" అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. పదేళ్లలో కేసీఆర్ ఏ ప్రాజెక్టును పూర్తి చేయలేదని ముఖ్యమంత్రి విమర్శించారు. కేసీఆర్ తనను జైలుకు పంపించాడని, తన కుటుంబ సభ్యులను ఇబ్బంది పెట్టాడని రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ తనపై విమర్శలు చేస్తూ తోలు తీస్తానని హెచ్చరించారని, కానీ మా సర్పంచ్‌లు చింతమడకలో మిమ్మల్ని చీరి చింతాకు కడతారని హెచ్చరించారు. కేంద్రమంత్రిగా, ముఖ్యమంత్రిగా, రాష్ట్ర మంత్రిగా, తెలంగాణ సాధించిన అని చెప్పుకునే వ్యక్తిగా ఇలాంటి మాటలు మాట్లాడవచ్చా అని నిలదీశారు. మేం మాట్లాడాలనుకుంటే చాలా మాట్లాడుతామని, కానీ మర్యాద ఉండదని ఊరుకుంటున్నామని అన్నారు. మేం మాట్లాడటం మొదలు పెడితే మల్లన్న సాగర్‌లో దూకి చస్తావని ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఇదేనా అని ధ్వజమెత్తారు. పాలమూరు ప్రాజెక్టును ఎండగట్టారని, ప్రాజెక్టులు ఏవీ పూర్తి చేయలేదని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లు పాలమూరు ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. పదేళ్లలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని మండిపడ్డారు. కేసీఆర్ వలస వచ్చి పాలమూరు ఎంపీ అయ్యారని అన్నారు. పగ సాధించడం మొదలు పెడితే రాష్ట్రానికి నష్టం జరుగుతుందని వదిలి పెట్టానని అన్నారు. నేను ప్రమాణం చేసినప్పుడే ఆయన కూలబడ్డారని, ఇంతకంటే పెద్ద శిక్ష ఏముంటుందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ ఫాంహౌస్‌ను బందీఖానాగా మార్చుకున్నారని, చర్లపల్లి, చంచల్‌గూడ జైలుకు పంపినా అదే పరిస్థితి ఉంటుందని అన్నారు. తాను నల్లమల నుంచి వచ్చి జెడ్పీటీసీ, ఎమ్మెల్యే, ఎంపీ తర్వాత ముఖ్యమంత్రిని అయ్యానని రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే ఏ అంశంపై అయినా చర్చించడానికి సిద్ధమని వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా కేసీఆర్ వయస్సును గౌరవిస్తామని, ఈ నెల 29 నుంచి జరగబోయే సమావేశాలకు కేసీఆర్ వచ్చి సూచనలు చేయాలని అన్నారు. ఖాళీగా ఉన్నప్పుడు పార్టీ కార్యాలయానికి వచ్చి ప్రెస్‌మీట్‌లు పెట్టడం కాదని అన్నారు.

# రుషికొండ నిర్మాణాలపై మరో రెండు ఫ్లోర్లు వేసుకోవచ్చు

- మంత్రిపయ్యావుల కేశవ్
- రుషికొండ ప్యాలెస్ వినియోగంపై సబ్ కమిటీ భేటీ
- హాస్పిటాలిటీ ఇండస్ట్రీ కోసం వినియోగించే అంశాన్ని పరిశీలించామన్న కేశవ్
- గత వైసీపీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన కందుల దుర్గేశ్

**అమరావతి- సూర్య వాస్తవం, డిసెంబర్ 24**

విశాఖలోని రుషికొండ ప్యాలెస్ వినియోగంపై ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ మూడవ సమావేశం ఈరోజు జరిగింది. ఈ సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేశ్, పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, టూరిజం ఎండీ, ఏపీ టీఏ సీఈఓ ఆమ్రపాలి, పర్యాటక శాఖ అధికారులు పాల్గొన్నారు. మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి వర్చువల్‌గా చేరారు. ప్యాలెస్‌ను హాస్పిటాలిటీ ఇండస్ట్రీ కోసం వినియోగించాలా? అనే అంశాన్ని పరిశీలించామని పయ్యావుల తెలిపారు. హోటల్ కోసం అదనపు స్థలం కావాలని కొందరు అడిగారని చెప్పారు. రుషికొండ కింద ఉన్న 9 ఎకరాల్లో 7 ఎకరాలు సీఆర్ జెడ్ నిబంధనల పరిధిలోకి వస్తాయని, అందులో ఎలాంటి నిర్మాణం జరపరాదని స్పష్టంచేశారు.ఇక ప్యాలెస్ చివరి రెండు బ్లాక్‌లు ప్రజలకు, సాంస్కృతిక కార్యక్రమాలకు, టూరిజం అవసరాలకు ఉంచబడతాయని తెలిపారు. తాజ్ గ్రూప్, లీలా హోటల్ గ్రూప్, అట్మాస్ఫియర్ కోర్ వంటి గ్రూపులు ప్రాజెక్టుల కోసం ముందుకు వచ్చాయని పయ్యావుల వెల్లడించారు. రుషికొండ నిర్మాణాలపై మళ్లీ రెండు ఫ్లోర్లు వేసుకునే అవకాశం ఉందని తెలిపారు. మరో మంత్రి కందుల దుర్గేశ్ మాట్లాడుతూ... ఆదాయం వచ్చే భవనాలను కూల్చి ప్యాలెస్ కట్టారంటూ గత వైసీపీ ప్రభుత్వంపై మండిపడ్డారు. రుషికొండ వినియోగానికి సంబంధించిన అనేక ప్రపోజల్స్ వస్తున్నాయని తెలిపారు. రుషికొండ కింద 9 ఎకరాల్లో సముద్రం ఆటుపోట్ల కారణంగా రెండెకరాలు మాత్రమే అందుబాటులోకి వస్తాయని చెప్పారు.



# బీజేపీ భూస్వామ్య మనస్తత్వానికి వ్యతిరేకంగా పోరాడతాం

**- లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్**

**న్యూఢిల్లీ- సూర్య వాస్తవం, డిసెంబర్ 24**

బిజెపి విధానాలను లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ బుధవారం తీవ్రంగా విమర్శించారు. బిజెపి తెచ్చిన విధానాలు ముఖ్యంగా వైశ్య సమాజాన్ని లక్ష్యంగా చేసుకుని చిన్న వ్యాపారాలను దెబ్బతీశాయని రాహుల్ ఆరోపిచారు. బిజెపి భూస్వామ్య మనస్తత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తామని, వైశ్య సమాజానికి పూర్తి మద్దతు ఇస్తామని ఆయన ప్రతిజ్ఞ చేశారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. 'నేను వ్యాపారులతో మాట్లాడినప్పుడు తమ వ్యాపారం పతనం అంచున ఉంది అని వ్యాపారస్తులు ఆవేదన చెందారు. వైశ్య సమాజం నుంచి వచ్చిన ఈ ఆవేదన నన్నెంతగానో కదలించింది. దేశ ఆర్థిక వ్యవస్థకు చారిత్రాత్మకంగా ఎంతో దోహదపడిన సమాజం నేడు నిరాశలో ఉంది. ఇది ప్రమాద హెచ్చరిక. బిజెపి ప్రభుత్వం గుత్తాధిపత్య సంస్థలకు స్వేచ్ఛను ఇచ్చింది. చిన్న, మధ్యతరహా వ్యాపారులను అధికార సంకెళ్లు, తప్పుడు జిఎస్‌టి వంటి లోపభూయిష్ట విధానాలతో బంధించారు' అని రాహుల్ ఎక్స్ పోస్టులో తీవ్రస్థాయిలో విమర్శించారు.

బిజెపి తెచ్చిన జిఎస్‌టి సవరణలు కేవలం విధాన వైఫల్యం కాదు. ఇది ఉత్పత్తి, ఉపాధి భారతదేశ భవిష్యత్తుపై ప్రత్యక్ష దాడి. ఇది బిజెపి ఫ్యూడల్ మైండ్‌సెట్ తెలియజేస్తోంది. దీనికి వ్యతిరేకంగా పోరాటం చేస్తాం. ఈ యుద్ధంలో దేశ వాణిజ్యానికి వెన్నెముక అయిన వైశ్య సమాజానికి మద్దతుగా నిలుస్తాను అని రాహుల్ అన్నారు.

# తమిళనాడులో రోడ్డు ప్రమాదం..

**- తొమ్మిది మంది మృతి**



**కడల్లూరు - సూర్య వాస్తవం, డిసెంబర్ 24**

తమిళనాడులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తొమ్మిది మంది మృతి చెందారు. అనేక మంది తీవ్రంగా గాయపడ్డారు. కడల్లూరు జిల్లాలోని తిట్టకుడి సమీపంలోని రామనాథం గ్రామంలో ప్రమాదం జరిగింది. తిరుచిరాపల్లి నుంచి చెన్నైకు జాతీయరహదారిపై వెళుతున్న తమిళనాడు ఆర్‌టిసి బస్సు టైరు బుధవారం రాత్రి 8 గంటల సమయంలో ఒక్కసారిగా పేలిపోవడంతో ఈ ప్రమాదం సంభవించింది. టైరు పేలిపోవడంతో అదుపు తప్పిన బస్సు జాతీయ రహదారికి అవతలి వైపునకు దూసుకునివెళ్లి ఎదురుగా వస్తున్న రెండు కార్లను ఢకొెంది. దీంతో రెండు కార్లు పూర్తిగా నుజ్జునుజ్జయ్యాయి. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు, సహాయ బృందాలు తక్షణ చర్యలను ప్రారంభించాయి. క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించాయి.

# సంపాదకీయం

## జెన్ జెడ్ చుట్టూ ప్రపంచం




జెన్ జడ్.. ఇటీవల ఈ పదం ఎక్కువగా వినిపిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా జెన్ జెడ్ యువత రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తోంది. బంగ్లాదేశ్, నేపాల్‌ల్లో ప్రభుత్వ మార్పుల్లో వీరి ప్రభావం కనిపించింది. ఇదే నేపథ్యంలో జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జెన్ జెడ్‌పై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. మార్చి 14న జరిగే జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని జెన్ జెడ్ థీమ్‌తో నిర్వహించనున్నారు. యువతను ఆకర్షించి పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యం. ఉద్యోగాలు, పారదర్శకత కోరే జెన్ జెడ్ ప్రజాస్వామ్యంలో మార్పులు తీసుకురాగలదా చూడాలి. ప్రపంచవ్యాప్తంగా జెన్ జెడ్ యూత్ ప్రభావం ఎక్కువగా ఉన్నట్లు కొన్ని వార్తా సంస్థలు తెలుపుతున్నాయి. ముఖ్యంగా ఆర్థిక, రాజకీయ అంశాల్లో ఈ యువత తమ ప్రభావంతో స్థితిగతులను మార్చి వేస్తున్నట్లు కొందరు మేధావులు అభిప్రాయపడుతున్నారు. దీంతో ప్రపంచం మొత్తం ఈ జెన్ జెడ్ యూత్ పై ఎక్కువగా ఫోకస్ చేస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో నేపాల్ రాజకీయాల్లో, బంగ్లాదేశ్ ప్రభుత్వం కూల్చడంలో ఉవని జి యూత్ ఎక్కువగా ప్రభావం చూపిందని తెలుస్తోంది. అయితే తాజాగా ఆంధ్రప్రదేశ్ లో జరిగిన జనసేన సమావేశంలో కూడా ఆ పార్టీ అధినేత మాట్లాడుతూ జెన్ జెడ్ యూత్ పై ఎక్కువగా ఫోకస్ చేయాలని అన్నారు. దీంతో జెన్ జెడ్ ప్రభావం రాజకీయ రంగంలో ఎంత ఉందో అర్థమవుతుంది. అసలు ఈ జెన్ జెడ్ యూత్ అంటే ఎవరు? 1997 నుంచి 2012 వరకు జన్మించిన వారు ఇప్పుడు యవ్వనంలోకి వచ్చారు. వీరిని జెన్ జెడ్ యూత్ అని అంటారు. ఈ యువత ఎక్కువగా సోషల్ మీడియాను ఉపయోగిస్తూ ఉంటుంది. సోషల్ మీడియాను ఉపయోగించడం మాత్రమే కాకుండా తమ అభిప్రాయాలను వెంటనే వ్యక్తం చేయడం.. సామాజిక పరిస్థితులపై విశ్లేషణ చేయడం.. తప్పు, ఒప్పు ల గురించి చర్చించడం తీవ్రమైంది. ఎక్కువగా సామాజిక మాధ్యమాల్లో సమాజంలో జరిగే పరిస్థితులపై వీరు వెంటనే తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తారు. అంతేకాకుండా ఎక్కడ ఏ చిన్న విభిన్న పరిస్థితి ఏర్పడిన దానిని వీడియో తీసి సోషల్ మీడియాలో అప్లోడ్ చేస్తారు. ఇలాంటి యూత్ వల్ల ప్రస్తుత ప్రపంచ పరిస్థితులపై ఎక్కువగా ప్రభావం పడుతుందని అంటున్నారు. గతంలో నేపాల్ లో యూట్యూబ్ కంటెంట్ పై పరిమితులు విధించడంపై యువత పెద్ద ఎత్తున ఆందోళన చేసిన విషయం తెలిసిందే. వీరి ఆందోళనతోనే అక్కడి ప్రధాని దేశం విడిచి వెళ్లిపోయిన పరిస్థితి ఏర్పడింది. అంటే సాధారణ ఉద్యమాలకు భిన్నంగా వీరి ఆందోళన తీవ్రతరంగా ఉంటుంది. ర్యాలీలు, సమావేశాల ద్వారా మాత్రమే కాకుండా సోషల్ మీడియా ద్వారా వీరి ఉద్యమాన్ని ఉధృతం చేస్తారు. ఒక సమాచారాన్ని చాలామందికి చేరవేయడంలో వీరి పాత్ర ఎక్కువగా ఉంటుంది. ఆ తర్వాత బంగ్లాదేశ్ లోను అలజడి రేపిన యువత జెన్ జెడ్ యువతదే ఎక్కువ అని అంటున్నారు. తాజాగా పవన్ కళ్యాణ్ నిర్వహించిన జనసేన సమావేశంలోనూ జెన్ జెడ్ యూత్ పై ఎక్కువగా ఫోకస్ చేయాలని అభిప్రాయపడ్డాడు. వచ్చే ఆవిర్భావ సభలో జెన్ జెడ్ థీమ్ తో నిర్వహించాలని అన్నారు. వీరిని ఉపయోగించుకోవడం ద్వారా పార్టీని మరింత బలోపేతం చేసుకోవచ్చని అన్నారు. ఇప్పటికే జనసేన పార్టీకి సోషల్ మీడియాలో అత్యధిక ఫాలోవర్స్ ఉన్నారు. వీరికి ఎక్కువగా ప్రాధాన్యతమిస్తే పార్టీ మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నట్లు చెప్పారు. అయితే వచ్చే రోజుల్లో కూడా వీరి ప్రభావం మరింతగా ఉండే అవకాశం ఉందని అంటున్నారు. మరో వైపు వత ఆకాంక్షలను ప్రభుత్వాలు విస్మరిస్తే, ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు వచ్చే ప్రమాదం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. దేశ యువత ఆకాంక్షలు ఆకాశాన్ని తాకుతుంటే, పాలకుల ఆలోచనలు మాత్రం పాకిస్థాన్, బంగ్లాదేశ్‌ల చుట్టూనే తిరుగుతున్నాయని విమర్శించారు. జెన్–జీ ఆలోచనలు, దేశ యువత ఆకాంక్షలు, ప్రభుత్వాల పాత్ర వంటి అంశాలపై తనదైన శైలిలో అద్భుతంగా ప్రసంగించి సభికులను ఆకట్టుకున్నారు. ప్రస్తుత తరం యువత (జెన్–జీ) కేవలం డిజిటల్ మీడియాకే పరిమితం కావద్దని కేటీఆర్ సూచించారు. సమాజం పట్ల అపారమైన బాధ్యతతో పనిచేయాలన్నారు. జెన్–జీ శక్తిని తక్కువ అంచనా వేయద్దని పాలకులను హెచ్చరించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 400 ఎకరాల అటవీ భూమిని అమ్మాలని ప్రయత్నిస్తే, సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు అద్భుతంగా పోరాడి ప్రభుత్వ మెడలు వంచిన విషయాన్ని గుర్తుచేశారు. చివరికి సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని ఆ భూముల విక్రయాన్ని నిలిపివేసిందన్నారు. ఇదే జెన్–జీ పవర్ అన్నారు. సోషల్ మీడియాలో చురుగ్గా ఉండే యువత, రాజకీయాల్లోకి కూడా రావాలని కేటీఆర్ సూచించారు. "రాజకీయాలు మీ భవిష్యత్తును నిర్ణయిస్తున్నప్పుడు, మీరే ఎందుకు రాజకీయాలను నిర్ణయించలేరు?" అని కేటీఆర్ యువతకు పిలుపునిచ్చారు. ప్రపంచం అంతా ముసలితనంలో ఉంటే భారతదేశం మాత్రం యవరక్తంతో ఉరకలెత్తుతోందన్నారు కేటీఆర్. ఈ యువశక్తిని దేశ నిర్మాణానికి వాడుకోవడంలో పాలకులు విఫలమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 1985లో చైనా, భారత ఆర్థిక వ్యవస్థలు దాదాపు సమానంగా ఉండేవన్నారు. అప్పుడు చైనా తలసరి ఆదాయం 300 డాలర్లు అయితే మనది 500 డాలర్లు. కానీ 40 ఏళ్ల తర్వాత చూస్తే, ఇండియా ఆర్థిక వ్యవస్థ 4 ట్రిలియన్ డాలర్లకే పరిమితం అయితే, చైనా 20 ట్రిలియన్ డాలర్లకు ఎదిగింది. ఇవాళ చైనా తలసరి ఆదాయం 13,000 డాలర్లు అయితే మనది కేవలం 2,700 డాలర్లే అన్నారు. చైనా మనల్ని ఎలా దాటిపోయిందో ప్రతి ఒక్కరూ ఆలోచించాలన్నారు. అమెరికా, యూరప్‌లతో చైనా పోటీపడితే, మనం మాత్రం పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లతో పోల్చుకుని మురిసిపోతున్నాం" అన్నారు.




# ఆ రెండు పార్టీలు
# కమలంపై కయ్యానికి దిగుతాయా




**హైదరాబాద్ – సూర్య వాస్తవం**

భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ , వైసీపీ అధినేత జగన్ ఇటీవల కొన్ని ప్రత్యేకమైన సిగ్నల్స్ పంపుతున్నారు. తాము బీజేపీకి వ్యతిరేకంగా భారీ యుద్ధం చేసేందుకు రెడీ అన్నట్లుగా వారు సంకేతాలు ఇస్తున్నారు. జగన్ ఎప్పుడూ లేని విధంగా ప్రధాని మోదీ చేపట్టిన కార్యక్రమాలపై అవినీతి ఆరోపణలు చేస్తూండటం, కేసీఆర్ నేరుగా ప్రెస్‌మీట్‌లో మోడీ వచ్చాకే తెలంగాణకు తీవ్ర నష్టం జరుగుతోందన్నట్లుగా మాట్లడుతూండటంతో ఏదో జరుగుతోందన్న అభిప్రాయం బలపడుతోంది. వీరిద్దరూ ఇతర కూటముల్లోకి వెళ్లలేరు. కానీ కలసి రాజకీయాలు చేస్తే బలంగా ఉంటామని మాత్రం నమ్ముతున్నారు. దేశ రాజకీయాలంతా ఓ వైపు సాగుతూంటే.. బీఆర్ఎస్, వైసీపై మాత్రం మరో వైపు సాగుతూంటాయి. వారు కాంగ్రెస్ కూటమిలోకి వెళ్లలేరు. బీజేపీ కూటమిలోకి వెళ్లలేరు. కాంగ్రెస్ కూటమిలోకి వెళ్తే ఎక్కడ టార్గెట్ అవుతామో.. ఎక్కడ కేసుల పాలవుతామోనన్న భయం ఉంటుంది. అదే సమయంలో వీర బీజేపీ కూటమిలోకి వెళ్లలేరు. ఇద్దరికీ ఓటు బ్యాంక్ సమస్య ఉంటుంది. జగన్ బీజేపీతో పొత్తులు పెట్టుకుంటే ఆయన పార్టీ నిర్వీర్యం అయిపోతుంది. కేసీఆర్ ఇప్పుడు చాలా ఓటు బ్యాంక్ ఆ పార్టీకి కోల్పోయారు కాబట్టి.. పొత్తులు పెట్టుకోవడానికి రెడీనే .కానీ బీజేపీనే ఆసక్తి చూపించడం లేదు. పార్టీని విలీనం చేయడానికి కూడా సిద్ధపడ్డారని సీఎంరమేష్ చెప్పారు. సాధ్యం కాలేదు. అందుకే తాము ఓ కూటమిగా ఉండాలని కేసీఆర్, జగన్ అనుకుంటున్నారు. జగన్ పుట్టినరోజు సందర్భంగా సజ్జల..జగన్మోహన్ రెడ్డి దేశవ్యాప్తంగా చక్రం తిప్పుతారని జోస్యం చెప్పారు. అందరి లక్ష్యం అదే. కేసీఆర్ కూడా అలాంటి లక్ష్యం కోసం చాలా కాలంగా ఎదురు చూస్తున్నారు. కానీ కలసి రావడం లేదు. గత ఎన్నికల్లో ఏపీ,తెలంగాణ, మహారాష్ట్ర ఇలా కొన్ని రాష్ట్రాలను టార్గెట్ చేసి రాజకీయాలు చేస్తే జీరో ఫలితం వచ్చింది. అటు జగన్ పరిస్థితి అంతే. అంతే వచ్చే ఎన్నికల్లో అయినా ఆ చక్రం తమ చేతికి వస్తుందని అనుకుంటున్నారు. వైసీప బలం తనకు అదనపు బలం అవుతుందని కేసీఆర్ అనుకుంటున్నారు. జగన్ అలా అనుకోకపోయినా.. ఇప్పటికైతే కేసీఆర్ తో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నారు. వచ్చే ఆరు నెలల్లో తమ రాజకీయ వ్యూహాన్ని మార్చుకుని బీజేపీపై వీరు యుద్ధం ప్రకటించబోతు న్నారని తాజా పరిణామాలను బట్టి అర్థం అవుతోందని రాజకీయ వర్గాలంటున్నాయి. కానీ ఇప్పుడు మాట్లాడే మాటలన్నీ కేవలం బీజేపీకి తామున్నామని గుర్తు చేయడానికేనని కొంత మంది అంటున్నారు. ప్రస్తుతం బీజేపీ హైకమాండ్ వీరి ఉనికిని పెద్దగా గుర్తించడం లేదు. వీరు కనుక.., బీజేపీపై యుద్ధం ప్రకటిస్తే.. రాజకీయాల్లో కాస్త మార్పు వస్తుంది. కానీ వీరు ఆ ధైర్యం చేస్తారా..? ఆరంభ శూరత్వమా అన్నది త్వరలో తెలుస్తుంది.

# పవన్‌కు జాతీయ స్థాయిలో ముద్ర...

**కాకినాడ – సూర్య వాస్తవం**

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జాతీయస్థాయిలో సైతం తన ముద్రను చాటుకుంటున్నారు. జాతీయ స్థాయి రాజకీయాలను శాసిస్తున్న ఆయన ఇప్పుడు ఏపీలో నిర్వర్తిస్తున్న శాఖలను సైతం ముందంజలో తీసుకెళ్తున్నారు. ఏపీలో ఆయన నిర్వహిస్తున్న పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జాతీయ స్థాయిలో నంబర్ వన్ గా నిలిచింది. గతంలో జాతీయస్థాయిలో 23వ స్థానంలో ఉన్న ఏపీ 22 స్థానాలను మెరుగుపరుచుకొని ఒకటో స్థానంలో నిలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. నేషనల్ మీడియాలో సైతం ఇప్పుడు పవన్ కళ్యాణ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. రాజకీయంగాను తనదైన మార్క్ చూపిస్తున్నారు పవన్ కళ్యాణ్. ఏపీలో కూటమి కట్టడంలో ఆయనదే కీలక పాత్ర. అప్పటివరకు బిజెపితో పాటు టిడిపి మధ్య గ్యాప్ ఉండేది. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని అధికారం నుంచి దూరం చేయాలంటే మూడు పార్టీల కలయికను ముందే గుర్తు చేశారు పవన్ కళ్యాణ్. వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేస్తే సంఘీభావం



తెలిపి నేరుగా టిడిపితో పొత్తు ఉంటుందని సంచలన ప్రకటన చేశారు. బిజెపిని కూటమిలోకి తేవడంలోనూ.. తెలుగుదేశం పార్టీని ఎన్డీఏలో చేర్చడంలోనూ చురుకైన పాత్ర పోషించారు. ఏపీలో మూడు పార్టీల కలయిక సూపర్ హిట్ గా నిలవగా.. జాతీయస్థాయిలో నరేంద్ర మోడీ మూడోసారి అధికారంలోకి రావడానికి కూడా ఒక విధంగా ఏపీ కారణం. ఇదంతా పవన్ కళ్యాణ్ కృషి ఫలితం. ఏపీలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పవన్ కళ్యాణ్ కు డిప్యూటీ సీఎం హోదా దక్కింది. అటు పవన్ కళ్యాణ్ సైతం తనకు గ్రామీణ నేపథ్యం ఉన్న శాఖలు కావాలని కోరారు. అందుకే పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి తో పాటు అటవీ శాఖను ఇచ్చారు చంద్రబాబు. దాదాపు 5 శాఖలు పవన్ కళ్యాణ్ వద్ద ఉన్నాయి. ఆ శాఖల విషయంలో పవన్ కళ్యాణ్ కు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. దీంతో కేంద్ర ప్రభుత్వ నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన నిధులు గ్రామీణ శాఖలకు కేటాయిస్తూ.. అభివృద్ధికి బాటలు వేశారు పవన్ కళ్యాణ్. పల్లె పండుగ పేరుతో రికార్డు స్థాయిలో గత రెండేళ్లుగా అభివృద్ధి పనులు చేశారు. దీంతో గ్రామాల్లో మౌలిక వసతులు సమకూరాయి. అందుకే జాతీయస్థాయిలో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ నెంబర్ వన్ గా నిలిచింది. ఈ క్రెడిట్ మాత్రం వన్ అండ్ ఓన్లీ పవన్ కళ్యాణ్.

# వై.ఎస్.జగన్ అక్రమాస్తుల కేసు మళ్లీ మొదటికి

**విజయవాడ – సూర్య వాస్తవం**

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసు దశాబ్ద కాలంగా తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లోనే కాకుండా, న్యాయ వ్యవస్థలోనూ ఒక సంచలనంగా మారింది. 2011లో ప్రారంభమైన ఈ కేసు విచారణ, అనేక మలుపులు తిరుగుతూ నేటికీ ఒక కొలిక్కి రాలేదు. తాజాగా నాంపల్లి సీబీఐ కోర్టు ప్రధాన న్యాయమూర్తి టి. రఘురాం బదిలీ అవ్వడం, ఆయన స్థానంలో కె. పట్టాభిరామారావు నియామకం జరగడంతో ఈ కేసు విచారణ మళ్లీ మొదటికి వచ్చిందనే చర్చ మొదలైంది. ఈ కేసు విచారణ నత్తనడకన సాగడానికి అనేక కారణాలున్నాయి. కేసు విచారణలో ఎదురవుతున్న అతిపెద్ద అవరోధం న్యాయమూర్తుల బదిలీలు. జగన్ అక్రమాస్తుల కేసులో వేల పేజీల డాక్యుమెంట్లు, వందలాది సాక్ష్యాలు, 11 ఛార్జ్‌షీట్లు ఉన్నాయి. ఒక న్యాయమూర్తి ఈ కేసు పూర్వాపరాలను అర్థం చేసుకుని, విచారణను ఒక దశకు తీసుకొచ్చే సమయానికి వారు బదిలీ అవుతున్నారు. కొత్తగా వచ్చే న్యాయమూర్తి మళ్లీ మొదటి నుండి కేసును అధ్యయనం చేయాల్సి రావడం వల్ల విచారణ ప్రక్రియ నిరంతరం జాప్యం అవుతోంది. సీబీఐ ఈ కేసులో దాదాపు 11 ప్రధాన ఛార్జ్‌షీట్లు దాఖలు చేసింది. ఇందులో పెట్టుబడులు, క్విడ్ ప్రో కో భూ కేటాయింపులు వంటి అనేక అంశాలు ముడిపడి ఉన్నాయి. నిందితులు తమపై ఉన్న ఆరోపణలను



కొట్టివేయాలని కోరుతూ డిశ్చార్జ్ పిటిషన్లు దాఖలు చేయడం వల్ల ప్రధాన విచారణ ప్రారంభం కావడం లేదు. అంతేకాక, విచారణ జరుగుతున్న ప్రతిసారీ ఏదో ఒక సాంకేతిక కారణాన్ని చూపుతూ అనుబంధ పిటిషన్లు వేయడం వల్ల కోర్టు సమయం వృధా అవుతోంది. కేసు దర్యాప్తు చేస్తున్న సీబీఐ , ఈడీ ( లపై కూడా పలు విమర్శలు ఉన్నాయి.

విచారణను వేగవంతం చేయడంలో ఈ సంస్థలు విఫలమవుతు న్నాయని ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. రాజకీయ ఒత్తిళ్లు లేదా వ్యూహాత్మక జాప్యం వల్లనే సీబీఐ కోర్టులో గట్టిగా వాదనలు వినిపించడం లేదనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో ఉంది. జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పాలనాపరమైన కారణాలను చూపుతూ వ్యక్తిగత హాజరు నుండి మినహాయింపు పొందేవారు. ప్రధాన నిందితులు కోర్టుకు హాజరు కాకపోవడం, వారి తరపు న్యాయవాదులు వాయిదాలు కోరడం వల్ల విచారణ ముందుకు సాగడం లేదు. సీబీఐ కోర్టులో విచారణ జరుగుతున్నప్పుడు, నిందితులు ఉన్నత న్యాయస్థానాలను ఆశ్రయించి స్టే తీసుకురావడం లేదా విచారణపై అభ్యంతరాలు వ్యక్తం చేయడం వల్ల విచారణ ప్రక్రియ నిలిచిపో తోంది. ఒక ఛార్జ్‌షీట్‌పై విచారణ జరుగుతున్నప్పుడు మరొక దానిపై స్టే రావడం వల్ల గందరగోళం ఏర్పడు తోంది. న్యాయమూర్తి కె. పట్టాభిరామారావు బాధ్యతలు చేపట్టడంతో, ఈ కేసు మరోసారి కీలకాంశంగా మారింది. అయితే, కొత్త న్యాయమూర్తి ఈ భారీ కేసును ఎంత వేగంగా అర్థం చేసుకుంటారు, దర్యాప్తు సంస్థలు ఎంతటి సహకారాన్ని అందిస్తాయి అనే దానిపైనే ఈ కేసు భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. సామాన్య ప్రజల్లో న్యాయ వ్యవస్థపై నమ్మకం కలగాలంటే, ఇలాంటి కీలక కేసుల్లో విచారణ కాలపరిమితితో కూడి ఉండాలని న్యాయ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.

# గ్రామ స్థాయిలో అవగాహన కల్పించండి ...!

## ఆడ పిల్లల ప్రాముఖ్యతపై

- అనంతపురం ఆర్డీవో కేశవ నాయుడు




**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం, డిసెంబర్ 24:** అనంతపురంలోని స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డిఓ కేశవ నాయుడు అధ్యక్షతన గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం డివిజనల్ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మాట్లాడుతూ ఆడ పిల్లల ప్రాముఖ్యత గురించి ప్రతి మండలంలో ఉన్న గ్రామాలలోఅవగాహన కల్పించాలని అలాగే ఎక్కువ టీనేజ్ ప్రెగ్నెన్సీల ఉన్న మరియు ఎక్కువ బాల్యవివాహాలు జరిగిన గ్రామాలను ఎంచుకొని ఆ గ్రామాలలో సచివా లయం సిబ్బంది, వైద్య శాఖ సిబ్బంది సంయుక్తంగా అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేయాలని ఆదేశించారు. అలాగే గ్రామస్థాయిలో యుక్త వయసు బాలికల తల్లిదండ్రులకు కనీసం నెల రోజులకు ఒకసారి బాల్యవివాహాలపై, టీనేజ్ ప్రెగ్నెన్సీ వల్ల అనర్థాలు దుష్పరిమాణాలు తెలియజేస్తూ సచివాలయ సిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, మహిళా పోలీస్ ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం సంబంధిత అన్ని డిపార్ట్మెంట్లు కలిసికట్టుగా పైలెట్ ప్రాజెక్టు మోడ్‌లో తీసుకోవాలని సంబంధిత డిపార్ట్మెంట్‌లకు ఆదేశించారు. లింగ నిర్ధారణ జరగకుండా ఆకస్మిక తనికీలు, గట్టి నిఘా పెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ హాస్పిటల్ చిన్న పిల్లల వైద్య నిపుణులు, డాక్టర్ రవికుమార్, స్త్రీ వైద్య నిపుణులు, డాక్టర్ నిస్సార్ బేగం, పేతాలజిస్ట్, డాక్టర్ దివ్య, ఆర్‌డిటి సంస్థ నుంచి డాక్టర్ దుర్గేష్, పోలీస్ శాఖ నుంచి, విజయభాస్కర్, ఎస్సై, ఎన్జీవో రెడ్స్ నుంచి, సుశీల, ఐసిడిఎస్ నుంచి శ్రీమతి సంధ్యారాణి,ఎచ్ఈఈఓ త్యాగరాజు, డిప్యూటీ హెచ్ఈఓ, గంగాధర్, వేణుగోపాల్, వెంకటేష్, కిరణ్, శ్రీకాంత్, లీగల్ అడ్వైజర్, ఆషారాణి, పాల్గొన్నారు.

## నారాయణ స్కూల్లో ముందస్తు క్రిస్టమస్ వేడుకలు

- ప్రతి ఒక్కరూ క్రీస్తు చూపిన ప్రేమ మార్గంలో నడవాలి
- ఏజీఎం కిరణ్ కుమార్ రెడ్డి




**పులివెందుల - సూర్య వాస్తవం, డిసెంబర్ 24:** పులివెందుల పట్టణ పరిధిలోని నారాయణ పాఠశాలలో ముందస్తుగా క్రిస్టమస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏజీఎం కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని ప్రార్థనలో పాల్గొని, యేసుక్రీస్తు పుట్టుక గురించి ఆయన చూపిన ప్రేమ మార్గం గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ వెన్న పూస హరిత రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ప్రేమ, శాంతి మార్గంలో నడవాలని ఆకాంక్షించారు. ఈ కార్య క్రమంలో విద్యార్థులు వేసిన శాంటా క్లాస్ వేషధారణలు, చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి, ఈ కార్యక్రమంలో ఉపాద్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు

- ప్రత్యేక అలంకారంలో అయ్యప్ప స్వామి



**పులివెందుల - సూర్య వాస్తవం, డిసెంబర్ 24:** పులివెందుల పార్నపల్లి రోడ్డు కోటి సమాధి వద్ద కొలువై ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో హరిహర పుత్రుడు అయ్యప్ప స్వామికి విశేష పూజలు నిర్వహి ంచారు. బుధవారం ఉదయా స్తమాన ఆలయ ప్రధాన అర్చకులు సాయి మధు గురుస్వామి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృత అభిషేకం సహస్ర నామార్చన బిల్వ అర్చన, అష్టోత్ర శతనామావళి తదితర పూజ కైకర్యాల అనంతరం అయ్యప్ప స్వామి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు గురు స్వామి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ప్రతి మాసంలో స్వామివారి జన్మ నక్షత్రాన విశేష పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. స్వామివారి ఆశీస్సులతో కార్తీక మాసం, 365 రోజులలో ప్రతి నిత్యము బుధవార రోజులలో స్వామివారికి విశేష పూజలు ధూప దీప నైవేద్యాలు భక్తుల సహాయ సహకారాలతో భక్తిశ్రద్ధలతో నిర్వహించడంగ జరుగుతోందన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటుచేసిన తీర్థ ప్రసాదాలను అయ్యప్ప స్వాములకు భక్తులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణానికి విరాళం



**వేంపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 24 :** వేంపల్లి పట్టణ సమీపంలోని స్వామి వివేకానంద ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరెస్పాండెంట్ చందా సుబ్బ రామాంజనేయ రెడ్డి, స్నేహిత అమృత హస్తం సేవాసమితి నూతన భవన నిర్మాణం కొరకు 25 వేల రూపాయలు విరాళాన్ని బుధవారం పాఠశాలలో సేవాసమితి అధ్యక్షులు రాజు కి అందజేశారు. అలాగే శ్రీ చైతన్య పాఠశాల కరెస్పాండెంట్ చక్రపాణి రెడ్డి 10 వేల రూపాయలు విరాళం పాఠశాలలో నిర్వహించిన ఒక కార్యక్రమం లో విరాళం మొత్తాన్ని సేవాసమితి అధ్యక్షులు రాజు కి అందజేశారు. అలాగే డాక్టర్ ఎస్ ఎఫ్ బాషా రూ.5 వేలు, వీణా క్లాత్ స్టోర్ యజమాని పుల్లగూర అరవింద్ 5 వేల రూపాయలు విరాళం అందజేశారు. విరాళాలు అందజేసి భవన నిర్మాణంలో భాగస్వాములు అయిన దాతలకు స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## ఎస్ఐ సుమతిని మర్యాద పూర్వకంగా కలిసిన వైసీపీ మండల నాయకులు

**గాండ్లపెంట - సూర్య వాస్తవం, డిసెంబర్ 24 :** గాండ్లపెంట మండల నూతన ఎస్ఐగా బి.సుమతి బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో వైసీపీ మండల నాయకులు మర్యాద పూర్వకంగా ఎస్ఐ సుమతిని కలిసి ఘనంగా సన్మా నించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు మాట్లాడుతూ శాంతి భద్రతలు పట్ల నిశ్పక్ష పాతంగా వ్యవహరించా లని, సమస్యాత్మక గ్రామాలలో ప్రత్యేక దృష్టి సారించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల నాయకులు రవీంద్రా రెడ్డి, చంద్ర శేఖర్ రెడ్డి, శంకర్ నాయుడు, పామిడి బాలు, భాస్కర్ రెడ్డి,రామాంజులు రెడ్డి, మైనుద్దీన్, ముజాహిద్, వాలంటీర్ మండల అధ్యక్షుడు ఆజాద్ భాష తదితరులు పాల్గొన్నారు.



## ఇస్రో ఎల్‌వి ఎమ్3-ఎమ్6 ఘన విజయం

- బ్లూ బర్డ్ బ్లాక్-2 కక్ష్యలోకి దేశానికి గర్వకారణం
- ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి




**పులివెందుల- సూర్య వాస్తవం, డిసెంబర్ 24:** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన బాహుబలి రాకెట్ ఎల్‌విఎం3-ఎమ్6' ప్రయోగం విజయవంతంగా పూర్తై, 'బ్లూ బర్డ్ బ్లాక్-2' ఉపగ్రహాన్ని నిర్దిష్ట కక్ష్యలోకి ప్రవేశపెట్టడం దేశానికి గర్వకారణమని ఎమ్మెల్సీ రామగోపాల్ రెడ్డి అన్నారు.
ఈ విజయంతో భారతదేశం అంతరిక్ష సాంకేతికతలో తన విశ్వసనీయతను మరోసారి ప్రపంచానికి చాటిందన్నారు. అత్యంత క్లిష్టమైన ఈ ప్రయోగాన్ని ఇస్రో శాస్త్రవేత్తలు సమర్థవంతంగా పూర్తి చేయడం దేశ యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ఎల్ వి ఎం 3 రాకెట్ సామర్థ్యం భవిష్యత్తులో మరిన్ని కీలక అంతరిక్ష ప్రయోగాలకు దోహదపడుతుందని తెలిపారు. ఈ విజయం భారతదేశాన్ని అంతర్జాతీయ అంతరిక్ష రంగంలో మరింత ముందుకు నడిపిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఇస్రో చైర్మన్, శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సాంకేతిక సిబ్బంది అందరికీ రామగోపాల్ రెడ్డి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

## బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు దురదృష్టకరం

డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 24 :** మన పొరుగు దేశమైన బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు జరగడం దురదృష్టకరం, శోచనీయమని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ఆవేదన వెలిబుచ్చారు. బుధవారం వేంపల్లిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 18వ తేదీన చంద్రదాస్ దీపు అనే హిందువును బంగ్లాదేశ్ లో కొట్టి సజీవ దహనం చేయడం అత్యంత అమానుషం అని తులసి రెడ్డి అన్నారు. హిందువుల ఛాంపియన్ అని చెప్పుకుంటున్న మోడీ ప్రభుత్వం ఈ విషయంలో మౌనంగా ఉండడం, నిస్సహాయతతో ఉండడం శోచనీయం. ఇప్పటికైనా మోడీ ప్రభుత్వం సామ దాన భేద దండోపాయాలు ప్రయోగించి, అంతర్జాతీయ సమాజం నుండి ఒత్తిడి తెప్పించి బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను వెంటనే అరికట్టాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై పునరాలోచించాలి

- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 24 :** పులివెందుల, మార్కాపురం, మదనపల్లి, ఆదోని ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేసేటందుకు రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు పిలువగా పులివెందుల ,మార్కాపురం, మదన పల్లి కళాశాలలకు ఒక్క బిడ్ కూడా రాకపోవడం, ఆదోని కళాశాలకు ఒక్క బిడ్ మాత్రమే రావడం గమనార్హం. టెండర్ల గడువు రెండుసార్లు పొడిగించినప్పటికీ టెండర్లలో పాల్గొనేందుకు ఎవరు ముందుకు రాలేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పునరాలోచించి ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, జిఓ 590ని ఉపసంహరించుకోవాలని తులసి రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## అర్హులందరికీ కొత్త పింఛన్లు ఇవ్వాలి

- డాక్టర్ నర్ర రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 24 :** కూటమి అధికారంలోకి వచ్చి 18 నెలలు అయినప్పటికీ ఇప్పటికీ అర్హులకు ఒక్క కొత్త పెన్షన్ కూడా ఇవ్వకపోవడం శోచనీయం. జిల్లాకు 200 చొప్పున కొత్త పెన్షన్ ఇవ్వాలని ఇటీవల ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. ఇది సమంజసం కాదు .ఒక కడప జిల్లాలోనే 1500 మంది అర్హులైన వారు కొత్తగా దరఖాస్తు చేసుకున్నారు. సంఖ్యపై పరిమితి విధించడం సమంజసం కాదు. అర్హులందరికీ సంఖ్యతో సంబంధం లేకుండా పెన్షన్లు ఇవ్వాలి. అదేవిధంగా పెన్షన్లు కుటుంబ పెన్షన్లు కాదు .ఇవి వ్యక్తిగత పెన్షన్లు. కుటుంబంలో ఒకరికే ఇస్తామనడం సమంజసం కాదు. కుటుంబంలో ఎంతమంది అర్హులు ఉంటే అంత మందికి ఇవ్వాలి. 60 ఏళ్లు దాటిన వృద్ధ దంపతుల్లో ఒకరికే పెన్షన్ ఇస్తామనడం ,అదేవిధంగా కోడలు వితంతువు , అత్త వృద్ధురాలు అయితే వారిలో ఒకరికే పెన్షన్ ఇస్తామనము సమంజసం కాదు. ఇది భార్యాభర్తల మధ్య , అత్తా కోడళ్ళమధ్య లడాయి పెట్టడమే అవుతుంది. కాబట్టి ఇంటిలో ఎంతమంది అర్హులు ఉంటే అంతమందికి పెన్షన్ ఇవ్వాలని తులసి రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ ఓయ్ పార్టీ కడప జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్ గౌడ్, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి సుబ్బారెడ్డి ,బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉత్తన్న తదితరులు పాల్గొన్నారు.

## జగన్ రఫ్ఫా రఫ్ఫా భాషను, పవన్ పీకుడు భాషను విరమించుకోవాలి

- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 24 :** జగన్ పుట్టినరోజు సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా కొన్నిచోట్ల జగన్ ఫ్లెక్సీలకు రక్తాభిషేకం చేయడం, కదిరి నియోజకవర్గం, తనకల్లు మండలం, ముత్యాల వాండ్ల పల్లి లో వైకాపా కార్యకర్తలు అజయ్ దేవ్, అంజనప్ప తదితరులు సంధ్యారాణి అనబడే ఏడు నెలల గర్భిణీనీ జుట్టు పట్టుకుని కడుపు మీద తన్నడం దుర్మార్గం. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా జగన్ తన కార్యకర్తలను మందలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అదేవిధంగా రఫ్ఫా రఫ్ఫా,గంగమ్మ జాతర లాంటి పదాలను అటు జగన్ ఇటు ఆయన పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు విరమించుకుంటే అది వారికే మంచిది. అదే సమయంలో పవన్ కళ్యాణ్ తదితర కూటమి నాయకులు పీకుడు భాషను వదిలించుకుంటే మంచిది.

## తాగునీటి పైపులైన్ పగిలి నీరు వృధా

- పట్టించుకోని పంచాయతీ అధికారులు
- ఇడుపులపాయ జనసేన నాయకులు పోతిరెడ్డి చలపతి

**వేంపల్లె - సూర్య వాస్తవం, డిసెంబర్ 24 :** ఇడుపుల పాయ పంచాయతీలోని మారుతి నగర్‌లో గత పది రోజులుగా తాగునీటి పైపులైను పగిలిపోవడంతో ఆ గ్రామ ప్రజలకు తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. గత పది రోజులుగా పంచాయతీ అధికారులకు , ఆ గ్రామ సర్పంచ్ కు తెలియజేసినా ఎవరూ కూడ పట్టించుకోవడం లేదని ఆ గ్రామ ప్రజలు వాపోతున్నారు. పంచాయతీ అధికారు లు తక్షణమే స్పందించి అక్కడ పైపులైను లీకేజీలను వెంటనే మరమ్మత్తులు చేయాలని ఇడుపులపాయ జనసేన పార్టీ నాయకులు పోతిరెడ్డి చలపతి సూచించారు.



# టీడీపీ వీడి వైకాపాలోకి 20 కుటుంబాలు చేరిక

## - పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పిన వైఎస్ మనోహర్ రెడ్డి



**పులివెందుల - సూర్య వాస్తవం, డిసెంబర్ 24 :** పులివెందుల పట్టణంలోని బేతేలు చర్చి సమీపంలో ఉన్న టిడిపి నాయకులు బుధవారం కౌన్సిలర్ శ్యామల దేవి, కౌన్సిలర్ కోడి రమణ, చిన్నల ఆధ్వర్యంలో టిడిపి పార్టీని వీడి వైకాపా పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారికిహజీరా, ఆయేషా, అనిప, ఇబ్రహీం, యూసుఫ్, మహ మ్మద్, రఫీ, బావ పక్రుద్దీన్, కాజా, హమీద, మాబ్జాన్, కైరున్, మాబ్జాన్, ఆదం, ఇమ్రాన్ భాష, నూర్ మహ్మద్, మున్ని, కౌసర్, బాబావల్లి, మున్ని, చాంద్ భాషా, మున్సిపల్ వైకాపా ఇన్చార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అన్ని పథకాలు ఇంటి వద్దకు వచ్చి అందించే వారిని, ఈ ప్రభుత్వంలో ఒక పథకం కూడా అందలేదని వారన్నారు. గత ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి సంక్షే మానికి పెద్ద పీటవేశారన్నారు. ఈ కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి జరిగింది శూన్యమన్నారు. జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకునేందుకు కూటమి ప్రభుత్వాన్ని వీడి వైకాపాలో చేరడం జరిగిందన్నారు. కూలి పని



చేసుకునే వారికి పనులు లేక కూటమి ప్రభుత్వంలో అల్లాడుతున్నారన్నారు. గత ప్రభుత్వంలో 15 రోజులు ఇంటి వద్దకు వచ్చి రేషన్ బండ్లు రేషన్ ఇచ్చేవని, ఈ కూటమి ప్రభుత్వంలో రెండు రోజులకే రేషన్ బియ్యం అయిపోయాయని డీలర్లు చెప్తున్నారన్నారు. ఈ విధంగా పంచితే పేద ప్రజలు ఏ విధంగా బతుకుతారని వారన్నారు. జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకుంటే సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందుతాయి అన్నారు. కూటమి ప్రభుత్వంలో రౌడీయిజం రాజ్యమేలుతుందన్నారు. ఈ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు రాష్ట్ర ప్రజలు వేచి ఉన్నారన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు కౌన్సిలర్ పార్నపల్లి కిషోర్, మాజీ చైర్మన్లు చిన్నప్ప, రసూల్, వైకాపా నాయకులు వీరారెడ్డి, చలపతి, నరసారెడ్డి, కనక, వార్డు ప్రజలు వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ పోటీలలో జాతీయ స్థాయికి అర్హత ట్రిబుల్ ఐటీ విద్యార్థులు



**వేంపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 24:** వికసిత్ భారత్ పోటీలలో జాతీయ స్థాయికి అర్హత సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించిన ట్రిబుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కుమారస్వామి గుప్తా భారత ప్రభుత్వం వికసిత్ భారత్ ఏ2047 లక్ష్య సాధనలో యువత భాగస్వామ్యం పెంచడం, వారి నాయకత్వ లక్షణాలను ప్రోత్సహించడం కోసం వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ ( విబివైఎల్డి ) 2026 పోటీలను దేశ వ్యాప్తంగా నిర్వహించగా.. ట్రిబుల్ ఐటీ ఆర్ కే వ్యాలీ క్యాంపస్ నుండి 14 మంది విద్యార్థులు పాల్గొనగా 10 మంది విద్యార్థులు జాతీయ స్థాయికి అర్హత సాధించారని, ఈ పోటిలలో రాష్ట్రవ్యాప్తంగా 45 మంది అర్హత పొందితే అందులో పది మంది విద్యార్థులు కేవలం ఆర్కే వ్యాలీ క్యాంపస్, అర్జీ యూకేటి - ఏపీ నుండి ఎన్నికవ్వడం విశేషమైన విజయం, విద్యార్థులకు, విశ్వ విద్యాలయానికి ఎంతో గర్వకారణమని డైరెక్టర్ తెలిపారు. ఈ పోటీలను 15-29 ఏళ్ల యువత కోసం భారత ప్రభుత్వం నిర్వ హించే ఒక ప్రతిష్ఠాత్మక పోటీ, ఇది క్విజ్, ఎస్సే ఛాలెంజ్, ప్రెజెంటేషన్ రౌండ్స్ ద్వారా దేశ నిర్మాణంపై వినూత్న ఆలోచనలను ఆహ్వానిస్తుందని, విజేతలకు జాతీయ స్థాయి లో గుర్తింపు, మార్గదర్శకత్వం లభిస్తాయని తెలిపారు.

## గ్లోబల్ పబ్లిక్ స్కూల్‌లో ఘనంగా ముందస్తు క్రిస్మస్ సంబరాలు





**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 24:** మండల కేంద్రంలోని గ్లోబల్ పబ్లిక్ స్కూల్‌లో కరస్పాండెంట్ దాక్షాయని ఆధ్వర్యంలో బుధవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపు కున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్కిరెడ్డిపల్లి సెయింట్ జోసెఫ్ క్యాథలిక్ చర్చి రెవరెండ్ ఫాదర్ ఎల్. విజయ్ మోహన్ రెడ్డి క్రిస్మస్ కేకును కట్ చేసి చిన్నారులతో కలిసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు జననం వల్ల లోకానికి వెలుగు వచ్చిందని అన్నారు. క్రీస్తు జననం, మానవాళికి ఆయన అందించిన సందేశంతో పాటుగా, శాంతి, ప్రేమ, ఆదరణలపై యేసు ప్రభువు ప్రపంచానికి చాటిచెప్పిన అంశాలను విద్యార్థులకు ఆయన వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శాంటా క్లాజ్ డ్రస్సులతో, తెల్లని రంగు దుస్తులు ధరించి చేసిన ప్రదర్శనలు ఆకట్టుకు న్నాయి. అనంతరం ప్రదర్శించిన క్రిస్మస్ నృత్యాలు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

### - లక్కిరెడ్డిపల్లి నూతన సిఐగా బాధ్యతలు చేపట్టిన కృష్ణంరాజు నాయక్‌ను కోరిన టిడిపి మండల అధ్యక్షులు యనమల మదనమోహన్



**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 24 :** లక్కిరెడ్డిపల్లి మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఇటీవలే బాధ్యతలు చేపట్టిన సిఐ కృష్ణంరాజు నాయక్‌ను టిడిపి మండల అధ్యక్షుడు మదన మోహన్ కోరారు. బుధవారం సిఐను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. మండలంలో పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని శాంతి పద్ధతులు పరిరక్షించేలా చర్యలు చేపట్టాలని సిఐని కోరారు. ఈ కార్యక్రమంలో మదన్మోహన్‌తో పాటు క్లస్టర్ కన్వీనర్ శంకారపు జయరాం, మద్దిరేవుల సింగిల్ విండో అధ్యక్షుడు బత్తిన దేవేంద్ర రెడ్డి, సర్పంచులు లక్ష్మీనారాయణ, కేశవయ్య, రంగసుబ్బయ్య, టిడిపి నాయకులు సిద్దక వెంకట్రామిరెడ్డి, యాగంటి సుధీర్, కావలి ఆంజనేయులు, సోడి వెంకటేశ్వర్లు, టీచర్ రామచంద్ర, తెలుగు యువత ధర్మారెడ్డి, బాలే పెద్దరెడ్డి యాదవ్, రామాంజనేయులు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## ఎరువు లారీని అడ్డుకున్న రైతులు




**గాండ్లపెంట - సూర్య వాస్తవం, డిసెంబర్ 24 :** మండలంలోని ఎలగూటివారిపల్లి, వద్దిరెడ్డిపల్లి, పోతులవాండ్లపల్లి గ్రామ రైతులు గురువారం ఎరువు లారీనీ అడ్డుకొని దళాల నుండి కర్ణాటక, తమిళనాడు తరలిస్తున్న ఎరువు లారీని అడ్డుకొని రైతులు లోడును ఖాళీ చేయించి వెనక్కి పంపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మాకు ఎరువులు లేక మేము ఇబ్బందులు పడుతుంటే ఇతర రాష్ట్రం వాళ్ళు వచ్చి మా ఎరువులు కొనుగోలు చేసి లక్షలాది రూపాయలు దళాలిల చేతిలో మారుతోందని గ్రామ రైతులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాకర్ల రవీంద్రారెడ్డి, కొండారెడ్డి, ప్రసాద్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, గంగిరెడ్డి, తిమ్మారెడ్డి, ఆదిరెడ్డి, లక్ష్మీ నర్సారెడ్డి, రాజారెడ్డి, ఈశ్వర్ రెడ్డి, రమణారెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

## రైతులకు పంటలపై అవగాహన



**గాండ్లపెంట - సూర్య వాస్తవం, డిసెంబర్ 24 :** మండలంలోనికటారుపల్లి గ్రామంలో గురువారం రైతులకు వేరుశనగ పంట, మొక్కజొన్న పంటలపై సమగ్ర యాజమాన్యం అంటే సరైన విత్తన ఎంపిక, భూమి తయారీ, విత్తే విధానం, ఎరువులు, నీటి యాజమాన్యం, కలుపు నివారణ, తెగుళ్లు-పురుగుల నివారణ, సరైన సమయంలో కోత, నిల్వ వంటి అన్ని పద్ధతులను అనుసరించి అధిక దిగుబడి సాధించడం పైనా సనావుల్లా ఏడిఏ కదిరి వారి వివరించారు. అలాగే రబీలో వేసినా ప్రతి పంట రైతు సేవ కేంద్రాలలో పంట నమోదు చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఏఓ - షాదాబ్, సరికల్చర్ టిఏ మదు, షాజాద్, ఎంపీఈఓ యామిని గ్రామ రైతులు పాల్గొన్నారు.

## స్నేహిత అమృత హస్తం భవనానికి విరాళాలు

### - అధ్యక్షుడు రాజుకు నగదు అందజేత



**వేంపల్లె - సూర్య వాస్తవం, డిసెంబర్ 24 :** స్నేహిత అమృత హస్తం సేవా సమితి నూతన భవన నిర్మాణానికి దాతలు విరాళాలు అందజేసినట్లు ఆ సమితి అధ్యక్షుడు రాజు వెల్లడించారు. బుధవారం స్థానిక శ్రీ చైతన్య హైస్కూల్ కరస్పాండెంట్ బి.చక్రపాణిరెడ్డి రూ.10 వేలు రూపాయలు విరాళం అందజేశారు. ఈ నగదు మొత్తాన్ని ఆ సేవా సమితి అధ్యక్షునికీ అందించారు. భవన నిర్మాణానికి దాతల విరాళం ఎనలేనిదని, వీరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ప్రతి రైతు ఈ పంట నమోదు చేసుకోవాలి






**తనకల్లు -సూర్య వాస్తవం, డిసెంబర్ 24:** మండల పరిధిలోని టీ సదుం గ్రామంలో ఈ పంట నమోదు ప్రక్రియ ను వ్యవసాయధికారి భారతి పరిశీలించారు. పంట పెట్టిన అందరు రైతులు పంట నమోదు చేసుకోవాలని చెప్పారు. గ్రామంలో సాగు చేసిన మొక్కజొన్న, వేరుశనగ పంటలు పరిశీలించి పంటలో వచ్చే తెగుల్ల నివారణ చర్యలు తెలిపారు. ప్రతి రైతు వారు సాగు చేసిన పంటల వివరాలు సంబంధిత రైతు సేవ కేంద్రం అధికారులను సంప్రదించి నమోదు చేసుకోవాలని తెలియజేశారు.

## ఘనంగా శ్రీ చైతన్య హైస్కూల్‌లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు

### - కరస్పాండెంట్ బి.చక్రపాణి రెడ్డి





**వేంపల్లె - సూర్య వాస్తవం, డిసెంబర్ 24 :** స్థానిక పట్టణంలోని శ్రీ చైతన్య హై స్కూల్‌లో క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముందస్తు వేడుకలు విద్యార్థుల మధ్య ఆనందోత్సాహాలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం క్రిస్మస్ అలంకరణలతో పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. విద్యార్థులు సాంటా క్లాజ్ వేషధారణ, ఏంజెల్స్ వేషధారణలో పాల్గొని క్రిస్మస్ క్యా రోల్స్ పాడుతూ, ఆట పాటలతో అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బి.చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ క్రిస్మస్ గురించి వివరిస్తూ ప్రేమ, శాంతి, సహనము, సేవాభావం వంటి క్రిస్మస్ విలువలను విద్యార్థులకు తెలియ జేశారు. అనంతరం పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్లు బి.చేతన్ రెడ్డి, చైతన్య రెడ్డి లు మాట్లాడుతూ...పండుగలు విద్యార్థుల్లో సాంస్కృతిక విలువలు, ఐక్యతను పెంపొందిస్తాయని అన్నారు. విద్యార్థులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించగా, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారన్నారు.

## తనకల్లు ఎక్సైజ్
# పోలీస్ స్టేషన్‌లో వాహనాల వేలంపాట

**కదిరి – సూర్య వాస్తవం, డిసెంబర్ 24:** శ్రీ సత్య సాయి జిల్లా కదిరి నియోజకవర్గం తనకల్లు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ లో ఎక్సైజ్ పోలీసులు వాహనాల వేలంపాటను నిర్వహించారు. వివిధ కేసుల్లో ఉన్న ద్విచక్ర వాహనాలు ఆటోలు కార్లను వేలంపాట పాడుతున్నట్లు ప్రజలకు ముందుగా సమాచారాన్ని అందజేసి బుధవారం ఉదయం తనకల్లు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఆవరణంలో వేలంపాటను నిర్వహించారు. 20 వాహనాలకు వేలంపాట వేయగా 19 వాహనాలను అర్హులైన లబ్ధిదారులు వేలంలో పాల్గొని హెచ్చు పాట మేరకు వాహనాలను దక్కించుకున్నారు ఒక్క వాహనం మాత్రం మిగిలిపోయింది. వేలంపాటలో పాల్గొనదలచిన లబ్ధిదారులు ముందుగా 2000 రూపాయలను ప్రభుత్వానికి డిపాజిట్ గా చెల్లించి వేలంపాటలో పాల్గొనే విధంగా అధికారులు నిర్ణయించారు ఒకవేళ వేలంపాటలో ఏదైనా ఒక వాహనం వారికి దక్కకపోతే వారి చెల్లించిన 2000 రూపాయల నగదును తిరిగి వాపసు చెల్లించబడుతుందని ఎక్సైజ్ శాఖ అధికారులు చెప్పి వెనక్కి ఇచ్చేశారు. వాహనాల వేలంపాట ద్వారా ప్రభుత్వానికి 52 లక్షల 3920 రూపాయలు ప్రభుత్వానికి ఆదాయం వచ్చినట్లు



ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు ఈ కార్యక్రమంలో శ్రీ సత్య సాయి జిల్లా ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ సూపరింటెండెంట్ నరసింహులు, తనకల్లు ఎక్సైజ్ సీఐ రాంప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రేమ..శాంతి..సంతోషాలకు చిహ్నాం క్రిస్మస్

**- చీకటి ఆవరించిన లోకానికి వెలుగును పంచేందుకు ఏసుప్రభు పుట్టుక**
**- రాష్ట్ర, జిల్లా ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు**
**- దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కోలా**



**పులివెందుల – సూర్య వాస్తవం, డిసెంబర్ 24 :** నేడు జరుపుకునే క్రిస్మస్ పండగను పురస్కరించుకొని ప్రతి ఒక్కరు కులమతాలకు అతీతంగా సుఖసంతోషాలతో జరుపుకోవాలని దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కోలా ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముందుగా ప్రతి ఒక్కరికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. క్రిస్మస్ పండుగను ప్రతి ఒక్కరూ కులాలకు మతాలకు అతీతంగా జరుపుకుంటారని క్రైస్తమంటే కులం కాదని, మతం కాదని మోక్షానికి మార్గమన్నారు. క్రిస్మస్ పండుగ పురస్కరించు కొని రాష్ట్ర ప్రజలు, జిల్లా ప్రజలు, నియోజకవర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని దేవుని ప్రార్థిస్తున్నట్లు ఆయన తెలిపారు. చీకటి ఆవరించిన లోకానికి వెలుగును పంచేందుకు ఏసుప్రభు పుట్టాడన్నారు. ప్రేమే మార్గంగా, క్షమే విజయం గా మారిన రోజా క్రిస్మస్ అన్నారు. వాటిలో దయను చూసిన దేవుడే ఏసుక్రీస్తు అన్నారు.

## అహుడపై అధికారులతో
# జేసీ, వైస్ ఛైర్మన్ సమీక్ష



**అనంతపురం కలెక్టరేట్ – సూర్య వాస్తవం, డిసెంబర్ 24:** నగరంలోని జాయింట్ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం అహుడపై కలిసి సంబంధిత అధికారులతో జాయింట్ కలెక్టర్, వైస్ ఛైర్మన్ శివ్ నారాయణ్ శర్మ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ, వైస్ చైర్మన్ మాట్లాడుతూ త్వరలో పెనుగొండ, మడకశిర ఎంఐజి లేఅవుట్‌లలో ప్లాట్‌లకు విక్రయానికి వేలం నిర్వహించాలన్నారు. అనుమతులు పొందిన అనాథరైజ్డ్ లేఔట్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని, అనుమతులు తీసుకొని మూడేళ్లలో పనులు పూర్తి చేయని యజమానులు, డెవలపర్లకు నోటీసులు ఇవ్వాలన్నారు. అనంతపురంలో స్విమ్మింగ్ పూల్, జిమ్, ఫుడ్ కోర్ట్ ఏర్పాటు ప్రణాళికపై చర్చించారు.

**కొనుతూరు లేఅవుట్‌లో ఫ్లాట్ల విక్రయానికి హెల్ప్ డెస్క్ ఏర్పాటు :**
ధర్మవరం పరిధిలోని కొనుతూరు లేఅవుట్‌లో ఫ్లాట్ల విక్రయానికి జాయింట్ కలెక్టర్ అండ్ వైస్ ఛైర్మన్ ఆదేశాలతో నగరంలోని అహుడ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. ఈ హెల్ప్ డెస్క్ ఫ్లాట్ల కొనుగోలుదారులు సద్వినియోగం చేసుకోవాలని జేసీ, వైస్ ఛైర్మన్ సూచించారు. ఈ కార్యక్రమంలో అహుడ సెక్రటరీ రామకృష్ణారెడ్డి, డీఈ రేవంత్, ఈఓ అరుణ కుమారి, ఏఓ రవిచంద్రన్, తదితరులు పాల్గొన్నారు.

## రాజంపేట పార్లమెంటరీ ఉపాధ్యక్షుడుగా వతన్ నిసర్

**- టీడీపీ కుటుంబ సభ్యులతో కలిసి పని చేస్తాం**
**- టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వతన్ నిసార్**



**రాయచోటి – సూర్య వాస్తవం, డిసెంబర్ 24:** తెలుగుదేశం పార్టీ సీనియర్ మైనారిటీ నాయకుడు, రాజంపేట పార్లమెంటరీ నియోజకవర్గ అధికార ప్రతినిధి వతన్ నిసార్ గతంలో పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తించిన టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా రాజంపేట పార్లమెంటరీ ఉపాధ్యక్షుడుగా నియామక పత్రాన్ని అందుకున్నట్లు వతన్ నిసార్ బుధవారం ఒక ప్రకటనలు తెలిపారు. ఈ సందర్భంగా వతన్ నిసార్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో నా సేవలను గుర్తించి ఈ పదవి ఇచ్చినందుకు రాష్ట్ర మంత్రి చంద్ర బాబుకి, ఈ పదవి రావడానికి సహకరించిన రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి, ఆయన సోదరుడు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డికి, ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వతన్ నిసార్ మాట్లాడుతూ అన్ని వర్గాలతో కలిసి మెలిసి జిల్లాలో తెలుగుదేశం పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేస్తానన్నారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సహాయ సహకారాలతో ప్రతి కార్యకర్తకు ముందుండి నడిపిస్తామన్నారు. తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతాభి వందనాలు తెలియజేశారు.

## సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి

**- అనంతపురం నాల్గవ పట్టణ సీఐ జగదీష్**





**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం, డిసెంబర్ 24:** సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని అనంతపురం నాల్గవ పట్టణ సీఐ జగదీష్ అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం నాడు స్థానిక కేశవ రెడ్డి స్కూల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ నేరాలు, రోడ్డు సేఫ్టీ,, మహిళా చట్టాలు, గంజాయి తదితర అంశాలపై అవగాహన చేశారు. విద్యార్థులకు గుడ్ టచ్ అండ్ బ్యాడ్ టచ్, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, రోడ్డు ప్రమాదాల నియంత్రణ, శక్తియాప్ ప్రయోజనాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సోషల్ మీడియాను సరైన మార్గంలో ఉపయోగిం చకపోవడం వల్ల ఎదురయ్యే అనర్థాలను వివరించారు. మైనర్ డ్రైవింగ్ వల్ల కలిగే ప్రమాదాలు, గంజాయి వినియోగం వల్ల ఆరోగ్యానికి, భవిష్యత్తుకు కలిగే నష్టాలు, మహిళల రక్షణకు సంబంధించిన చట్టాలు, పోక్సో చట్టాల ప్రాముఖ్యతను తెలియజేశారు. అత్యవసర సేవల కోసం డయల్ 100/ 112 సేవలను వినియోగించే విధానాన్ని వివరించి, ఈ సదస్సుల ద్వారా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు.

## పుణ్యక్షేత్రంలో పేకాట....!

**- శ్రీశైలం మల్లన్న సన్నిధిలో పేకాట పాపారావులు**
**- ఆలయ పవిత్రతను కాపాడాలంటున్నా ప్రజలు**
**- ఆలయ ఈవో శ్రీనివాసరావు పై మండిపడుతున్న భక్తులు, హిందూ సంఘాలు**





**కర్నూలు క్రైమ్ /శ్రీశైలం – సూర్య వాస్తవం, డిసెంబర్ 24:** దేవాలయాలంటే.. ఎంతో నిష్టగా, నియమంగా ఉండే అత్యంత పవిత్రమైన స్థలం. జనాలు ఎంత పవిత్రంగా, భక్తితో ఉంటే.. అక్కడ దైవం నడయాడుతూ.. భక్తుల కొంగు బంగారమ వుతాడని చెప్తుంటారు. కాని ఇప్పుడు దేవాలయ సిబ్బంది, అధికారులు సరైన పర్య వేక్షణ లేక కొందరు బహిరంగ ప్రదేశాల్లో బరి తెగిస్తున్నారు. పేకాట, జూదం లాంటివి ఆడుతూ పుణ్యక్షేత్రానికి చెడ్డ పేరు తీసుకొస్తున్నారు. అసలు వివరల్లోకి వెళితే.....పవిత్రమైన శ్రీశైలం పుణ్య క్షేత్రం పరిధిలో కొందరు టూరిస్ట్ బస్టాండ్ పార్కింగ్ బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో పెద్ద సంఖ్యలో నెటిజన్లు వారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భద్రతా సిబ్బంది నిర్లక్ష్యంతో పవిత్రమైన మల్లన్న సన్నిధిలో ఇలాంటి కార్య కలాపాలకు పాల్పడటంపై భక్తులు మండిపడుతున్నారు. గత వారంలో రీల్స్ ద్వారా యువతి వీడియో వైరల్ అవ్వడం తెలిసిందే. ఇప్పుడు పేకాట.... దీంతో శ్రీశైలం ఈవో శ్రీనివాసరావు పై గ్రామస్తులు, భక్తులు, హిందూ సంఘాలు మండిపడుతున్నాయి.

## గోల్ షాట్ బాల్ పోటీలో సెయింట్ థామస్ విద్యార్థుల ప్రతిభ

**కదిరి– సూర్య వాస్తవం, డిసెంబర్ 24 :** రాష్ట్రస్థాయి గోల్ షాట్ బాల్ పోటీలలో కదిరి సెయింట్ థామస్ విద్యార్థులు ప్రతిభ చాటారు , మంగళవారం గుంతకల్లులో జరిగిన కదిరి సెయింట్ థామస్ విద్యార్థులకు గుంతకల్లు మాంటిస్సోరి విద్యార్థులకు మధ్య జరిగిన హొరాహొరీ మ్యాచ్లో కదిరి సెయింట్ థామస్ విద్యార్థులు ఘన విజయం సాధించారు, రాష్ట్రస్థాయి మూడవ ఆంధ్రప్రదేశ్ పోటీలలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో ఘనవిజయం సాధించిన విద్యార్థులకు కదిరి సెయింట్ థామస్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు షబ్బీర్, పద్మజ లు వారికి అభినందనలు తెలియజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలలో ఘనవిజయం సాధించిన విద్యార్థులకు అనునిత్యం వారికి వ్యాయామ ఉపాధ్యాయుడు చేత శిక్షణ ఇస్తూ వారి క్రీడా నైపుణ్యాన్ని మెరుగుపరిచే విధంగా వారికి తర్ఫీదును ఇస్తున్నామని తెలిపారు, రానున్న పోటీ ప్రపంచంలో ఏ క్రీడా రంగంలో కూడా ఎదుర్కొనే విధంగా వారికి శిక్షణను ఇస్తున్నామని తెలిపారు, విద్యతో పాటు క్రీడా ,సాంస్కృతిక, రంగాలలో రాణించే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దడమే ధ్యేయంగా మా సెయింట్ థామస్ పాఠశాల ధ్యేయమని తెలిపారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు సుదర్శన్,ఏవో, సాంబశివరెడ్డి, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## కార్యకర్తలు, నాయకులతో మమేకమైన ఎంపీ అవినాష్ రెడ్డి

**- సమస్యలు, ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన ప్రజానీకం**



**పులివెందుల– సూర్య వాస్తవం, డిసెంబర్ 24:** పులివెందులలోని వైయస్ జగన్మోహన్ రెడ్డి క్యాంపు కార్యాలయం లో బుధవారం ఎంపీ అవినాష్ రెడ్డి కార్యకర్తలు, నాయకులతో మమేకమయ్యారు. క్యాంపు కార్యాలయం నందు శు భాకాంక్షలు సమస్యలు, ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసేందుకు అధిక మొత్తంలో ప్రజలు తరలిరాగా జిల్లా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ప్రజలు అందించినటువంటి వినతులను స్వీకరించి కొన్నింటిని అక్కడికక్కడే అధికారులతో చర్చించి పరిష్కరించే ప్రయత్నం చేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మూడు రోజుల పర్యటనలో భాగంగా మొదటిరోజు ప్రజలతో నేరుగా బేటీ కాగా రెండవ రోజు జగన్ మోహన్ రెడ్డిని కలిసేందుకు నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలిరాగా తను కలిసిన కార్యకర్తలతో ఎంపీ అవినాష్ రెడ్డి ఆత్మీయంగా పలకరించారు.



# ‘శంబాల’ ప్రీమియర్లకు మంచి రెస్పాన్స్ : అర్చన ఐయ్యర్



వెర్సటైల్ యాక్టర్ ఆది హీరోగా షైనింగ్ పిక్చర్స్ బ్యానర్ మీద మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభిమోజు నిర్మించిన చిత్రం ‘శంబాల : ఎ మిస్టిక్ వరల్డ్’. ఈ మూవీకి యుగంధర్ ముని దర్శకత్వం వహించారు. ఈ సినిమాకు శ్రీ చరణ్ పాకాల సంగీతాన్ని అందించారు. ఈ చిత్రాన్ని డిసెంబర్ 25న భారీ ఎత్తున రిలీజ్ చేయబోతోన్నారు. ఇప్పటి వరకు ‘శంబాల’ నుంచి వచ్చిన ప్రతీ కంటెంట్ ఆడియెన్స్‌ని ఆకట్టుకున్నాయి. ఇక ఈ క్రమంలో ప్రమోషన్స్‌లో భాగంగా హీరోయిన్ అర్చన ఐయ్యర్ మీడియాతో ముచ్చటించారు. ఈ క్రమంలో ఆమె చెప్పిన సంగతులివే..

**మీ నేపథ్యం గురించి చెప్పండి?**

నేను తెలుగమ్మాయినే. మాది చిత్తూరు జిల్లానే. కానీ విద్యాభ్యాసం అంతా బెంగళూరులోనే జరిగింది. నా మాతృభాష తెలుగే.

**‘శంబాల’ ప్రీమియర్లకు వస్తున్న రెస్పాన్స్ గురించి చెప్పండి?**

‘శంబాల’కు మంచి స్పందన వస్తోంది. వేసిన ప్రతీ ప్రీమియర్ హౌస్ ఫుల్ అవుతోంది. చాలా చోట్ల ఆడియెన్స్ భయపడిపోతున్నారు.

**దేవి పాత్ర గురించి చెప్పండి?**

‘శంబాల’లో నా పాత్రను ఆడియెన్స్ బాగా ఆదరిస్తున్నారు. నేను కనిపించిన ప్రతీ సారి ఆడియెన్స్ హ్యాపీగా ఫీలవుతున్నారు. ఆదితో నా కాంబినేషన్ సీన్లకు మంచి రెస్పాన్స్ వస్తోంది. ఇప్పటికే చాలా మంది దర్శకులు ఫోన్ చేసి అభినందిస్తున్నారు.

**‘శంబాల’ కథను డైరెక్టర్ చెప్పినప్పుడు మీకు ఎలాంటి ఫీలింగ్ కలిగింది?**

‘శంబాల’ నెరేషన్ పూర్తిగా వినకుండానే ఓకే చేశాను. ఇందులో స్క్రీన్ ప్లే అద్భుతంగా ఉంటుంది. రొమాంటిక్ పాటలు, స్టెప్పులు వేసే పాత్ర కాదని ముందే చెప్పారు. ఇలాంటి డిఫరెంట్ పాత్ర నా కెరీర్ ఆరంభంలోనే రావడం ఆనందంగా ఉంది.

**‘శంబాల’ విషయంలో నిర్మాతల సపోర్ట్ గురించి చెప్పండి?**

మా నిర్మాతలు మాకెంతో సపోర్ట్ చేశారు. మధ్యలో బడ్జెట్ పెరిగినా కూడా ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ‘శంబాల’ని గ్రాండ్‌గా నిర్మించారు. మా ఆర్టిస్టులందరినీ ఎంతో బాగా చూసుకున్నారు. వారిచ్చిన సహకారంతోనే అందరం బాగా నటించగలిగాం.

**ఆది గారితో వర్క్ ఎక్స్‌పీరియెన్స్ గురించి చెప్పండి?**

ఆది గారితో వర్క్ చేయడంతో చాలా విషయాల గురించి తెలుసుకున్నాను. ఆయనెంతో డౌన్ టు ఎర్త్. ఎంతో తక్కువ మాట్లాడతారు. అద్భుతంగా నటిస్తారు. చాలా మంచి వ్యక్తి. ఈ ప్రయాణంలో నాకెంతో అండగా నిలబడ్డారు. ఆయనతో మళ్లీ మళ్లీ నటించాలని అనుకుంటున్నాను.

**ఆడియెన్స్ అభిరుచి చాలా మారింది కదా?**

ప్రస్తుతం ఆడియెన్స్ రెగ్యులర్ చిత్రాల్ని చూడటానికి అంతగా ఇష్టపడటం లేదు. కొత్త కంటెంట్ ఉంటేనే, ఇంట్రెస్టింగ్ ఎలిమెంట్ ఉంటేనే ఆడియెన్స్ థియేటర్లకు వస్తున్నారు. కరోనా తరువాత ఆడియెన్స్ అభిరుచి మారిపోయింది. నాకు ఇంత మంచి సినిమా, పాత్ర రావడం ఆనందంగా ఉంది.

**‘శంబాల’ ఎలా ఉండబోతోంది?**

‘శంబాల’ ప్రారంభమైన ఐదు నిమిషాల్లోనే ఆ ప్రపంచంలోకి వెళ్తారు. ఇలాంటి చిత్రాన్ని థియేటర్లో చూస్తేనే ఆ వైబ్, ఆ ఫీలింగ్ వస్తుంది. విజువల్‌గా, సౌండ్ పరంగా చాలా గొప్పగా ఉంటుంది. అన్ని రకాల ఎమోషన్స్‌ను టచ్ చేస్తూ తీసిన ఈ చిత్రం ఈ క్రిస్మస్‌కి సరైన ఆప్షన్ అని అనుకుంటున్నాను.

**తదుపరి చిత్రాల గురించి చెప్పండి? ఫ్యూచర్‌లో ఎలాంటి పాత్రల్ని ఎంచుకోవాలని అనుకుంటున్నారు?**

ప్రస్తుతం పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీలో ఫ్యాంటసీ మూవీని చేస్తున్నాం. అది ఓ 500 ఏళ్ల క్రితం జరిగే కథ. చాలా భారీ ఎత్తున నిర్మిస్తున్నారు. ఎప్పుడూ కూడా నాకు కంఫర్ట్‌గా ఉండే రోల్స్‌ను ఎంచుకుంటాను. స్టోరీకి తగ్గట్టుగా పాత్ర డిమాండ్ చేస్తే రొమాంటిక్ సీన్లను కూడా చేస్తాను. ఛాలెంజింగ్ రోల్స్ చేయాలనే కోరిక ఉంటుంది. మంచి చిత్రాలను చేయాలని, మంచి కథల్ని చెప్పాలని అనుకుంటున్నాను.

**సినీ ప్రయాణంలో పేరెంట్స్ సపోర్ట్ గురించి చెప్పండి?**

నా తల్లిదండ్రుల సపోర్ట్ లేకపోతే నేను ఈ స్థాయికి వచ్చేదాన్ని కాదు. మా అమ్మ, అన్న ఎప్పుడూ నాతోనే ఉంటారు. నా పాత్రల ఎంపికలో వారి ప్రాధాన్యం కూడా ఉంటుంది. నా కలలకు ఎప్పుడూ సపోర్ట్ చేస్తుంటారు.

**ఇప్పటి వరకు సినిమా చూసిన వారు మీకు ఇచ్చిన కాంప్లిమెంట్స్ గురించి చెప్పండి?**

‘శంబాల’ ప్రీమియర్లు చూసిన వారంతా కూడా నా పాత్రని చూసి షాక్ అవుతున్నారు. థియేటర్ నుంచి బయటకు వచ్చాక నన్ను చూసే దృక్పథం మారిపోతోంది. ఇలాంటి పాత్రలు కెరీర్‌లో మళ్లీ మళ్లీ రావు. జీవితంలో ఒకేసారి ఇలాంటి పాత్రలు వస్తుంటాయి. నా కెరీర్ ఆరంభంలోనే ‘శంబాల’ లాంటి చిత్రం, దేవి లాంటి పాత్ర రావడం నా అదృష్టం.

**‘శంబాల’ గురించి ఫైనల్‌గా చెప్పండి?**

‘శంబాల’ చిత్రానికి వస్తున్న ఆదరణ చూస్తుంటే నాకెంతో సంతోషంగా ఉంది. ప్రీమియర్లకు వస్తున్న స్పందన చూసి టీం ఫుల్ ఖుషీగా ఉంది. ‘శంబాల’ అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది.

## రెండు అసభ్య పదాలను వాడినందుకు క్షమాపణలు : శివాజీ



**తెలంగాణ :** ‘ఆడ బిడ్డలకు క్షమాపణలు’ అని సినీనటుడు శివాజీ అన్నారు. బుధవారం శివాజీ విలేకరులతో మాట్లాడుతూ... ‘దండోరా’ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో తాను చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. ఈవెంట్ నుంచి బయటకు రాగానే తాను చేసిన తప్పును గ్రహించినట్లు తెలిపారు. హీరోయిన్ల దుస్తులను ఉద్దేశిస్తూ తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. అయితే, ఆ సందర్భంలో రెండు అసభ్య పదాలను వాడినందుకు మాత్రం క్షమాపణ చెబుతున్నానన్నారు. ఆ రోజు వేదికపై ఉన్న తన తోటి నటీనటులు, ఆడ బిడ్డలకు క్షమాపణలు చెప్పారు. అలాంటి పదాలు దొర్లకూడదు అని, 30 ఏళ్ల సినీ జీవితంలో అలా మాట్లాడలేదు అని అన్నారు. రాజకీయాల్లోనూ ఏ రోజూ ఎవరినీ ఒక చిన్న మాట అనలేదని చెప్పారు. హద్దు మీరి మాట్లాడలేదని అన్నారు. ఈవెంట్‌లో ఎందుకు అలా మాట్లాడానా ? అని బాధపడ్డానన్నారు. బయటకు రాగానే, పొరపాటుగా మాట్లాడినట్లు గ్రహించానన్నారు. అందుకు మనస్ఫూర్తిగా క్షమాపణ చెబుతున్నానన్నారు. అయితే, తాను ఇచ్చిన స్టేట్‌మెంట్‌కు మాత్రం కట్టుబడి ఉన్నానన్నారు. ఎవరికీ భయపడే పనే లేదు అని స్పష్టం చేశారు. ఆ రెండు పదాలు మాత్రం మాట్లాడటం తప్పు అని అన్నారు. తాను నిద్రపోయి 36 గంటలైందని, తనలో అంతర్మథనం మొదలైందని తెలిపారు. రాజకీయాల్లోనూ తప్పు మాట్లాడని తాను ఇలా ఎలా మాట్లాడానా ? అని ఆలోచిస్తూ ఉండిపోయానన్నారు. అందుకే సినిమా ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనలేదనీ, దాని నుంచి బయటకు వచ్చి తానే ప్రెస్‌మీట్ పెడతానని నిర్మాతకు చెప్పానని తెలిపారు. ఆయన ‘ఎందుకులేండీ.. వివాదమవుతుందేమో’ అని అన్నారని చెప్పారు. కానీ, సినిమాకు డబ్బులు తీసుకున్నందుకు తన వంతు ప్రమోషన్ చేయాలి కదా ! అని అన్నారు. ప్రేక్షకులు అందరూ కచ్చితంగా థియేటర్‌లో సినిమా చూడాలని కోరారు. సమాజాన్ని పట్టి పీడిస్తున్న కుల వ్యవస్థను గాఢంగా స్పృశించింది ఈ కథ అని తెలిపారు. మనుషులు ఉన్నంత వరకూ ఈ అసమానతలు ఉంటాయి. అలాంటి మంచి కథతో ‘దండోరా’ను తీర్చిదిద్దారు అని శివాజీ వివరించారు.



# చరిత్ర సృష్టించిన బీహార్

- 50 ఓవర్లలో 574పరుగులతో రికార్డు పుటల్లోకి..
- వైభవ్ సూర్యవంశీ డబుల్ సెంచరీ మిస్
- 32బంతుల్లోనే సెంచరీతో సకిబుల్ గని కూడా..
- శతకాలతో మెరిసిన కోహ్లి, రోహిత్, ఇషాన్ విజయ్ హజారే వన్డే టోర్నీ





వన్డే క్రికెట్‌లో బీహార్ నయా చరిత్రను లిఖించింది. 50ఓవర్లలో 574పరుగులు కొట్టిన తొలి జట్టుగా బీహార్ ఈ రికార్డును నెలకొల్పింది. విజయ్ హజారే వన్డే టోర్నమెంట్‌లో భాగంగా అరుణాచల్ ప్రదేశ్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ(190), ఆయుష్ ఆనంద్(116), నకీబుల్ గనీ(128) కూడా శతకాలతో రాణించడంతో నిర్ణీత 50ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 574పరుగులు చేసింది. అంతకుముందు ఈ రికార్డు తమిళనాడు జట్టు పేరిట ఉండేది. ఆ జట్టు 2022లో అరుణాచల్‌ప్రదేశ్‌పై 2వికెట్ల నష్టానికి 506పరుగులు చేసి తొలుత ఈ రికార్డు నెలకొల్పింది. ఇక అంతర్జాతీయ క్రికెట్‌లో ఈ రికార్డు ఇంగ్లండ్ పేర ఉంది. ఆ జట్టు 2022లో నెదర్లాండ్స్‌పై 50ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 498 పరుగులు చేసింది. తాజాగా బీహార్ జట్టు ఆ రెండు రికార్డులను బ్రేక్ చేసి కొత్త చరిత్రను లిఖించింది.

బెంగళూరు: విజయ్ హజారే వన్డే టోర్నమెంట్‌లో తొలిరోజే పలు రికార్డులు నమోదయ్యాయి. బీహార్ జట్టు లిస్ట్-ఎ క్రికెట్‌లో రికార్డు స్కోర్ నమోదు చేసి నయా చరిత్రను సృష్టించగా.. బీహార్ కెప్టెన్ సకిబుల్ గని కేవలం 32బంతుల్లో, జార?ండ్ ఓపెనర్ ఇషాన్ కిషన్ 33బంతుల్లోనే శతకాలు కొట్టిన బ్యాటర్లుగా రికార్డుల్లోకెక్కారు. అలాగే టీమిండియా స్టార్ ఆటగాళ్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, దేవదత్ పడిక్కల్‌కి తోడు 14ఏళ్ల వైభవ్ సూర్యవంశీ భారీ శతకాలతో మెరిసారు. వీరంతా ఆయా రాష్ట్రాల తరఫున విజరు హజారే వన్డే టోర్నీలో ఆడి సెంచరీలతో రాణించారు. విరాట్ కోహ్లి ఢిల్లీ తరఫున శతకం బాదగా.. రోహిత్ శర్మ(ముంబయి), ఇషాన్ కిషన్(జార?ండ్), దేవదత్ పడిక్కల్ కర్ణాటక తరఫున శతకాలతో రాణించారు. ఇక యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ రాంచీ వేదికగా అరుణాచల్ ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో బీహార్ తరఫున ఆడి కేవలం 36బంతుల్లోనే శతకం పూర్తి చేసి రికార్డులకెక్కాడు. కేవలం 14 ఏళ్ల 272 రోజుల వయసులోనే పురుషుల లిస్ట్-ఏ క్రికెట్‌లో శతకం సాధించిన అతి పిన్న వయస్కుడిగా వైభవ్ ఈ రికార్డు నెలకొల్పాడు. ఈ క్రమంలోనే 54 బంతు ల్లోనే 150 పరుగులు పూర్తి చేసి, ఏబీ డివిలియర్స్ (64బంతులు) ప్రపంచ రికార్డును కూడా బద్దలు కొట్టాడు. బీహార్ ఆటగాళ్లు ఆయుష్ ఆనంద్(116), నకీబుల్ గనీ(128) కూడా శతకాలతో రాణిం చడంతో ఆ జట్టు నిర్ణీత 50ఓవర్లలో 6వికెట్ల నష్టా నికి 574పరుగులు చేసి రికార్డు పుటల్లోకెక్కింది. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో అరుణాచల్ ప్రదేశ్ జట్టు 42.1ఓవర్లలో 177పరుగులకే ఆలౌటైంది.

జైపూర్ వేదికగా జరిగిన గ్రూప్-ఎ లీగ్ మ్యాచ్‌లో ముంబయి జట్టు 8వికెట్ల తేడాతో సిక్కింపై ఘన విజయం సాధించింది. ముంబయి తరఫున టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ(155బీ 94బంతుల్లో 18ఫోర్లు, 9సిక్సర్లు) భారీ శతకంతో మెరిసాడు. దీంతో సిక్కిం జట్టు నిర్దేశిం చిన 237పరుగుల లక్ష్యాన్ని ముంబయి జట్టు కేవ లం 30.3ఓవర్లలోనే సునాయాసంగా ఛేదించింది.

అహ్మదాబాద్‌లోని సర్దార్ పటేల్ స్టేడియంలో జార?ండ్ తరఫున ఇషాన్ కిషన్ సెంచరీతో మెరిసాడు. కర్ణాటకతో జరుగుతున్న గ్రూప్ లీగ్ మ్యాచ్‌లో బుధవారం జార?ండ్ జట్టు తొలిగా బ్యాటింగ్‌కు దిగిన నిర్ణీత 50 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 412 పరుగుల భారీస్కోర్ చేసింది. ఇషాన్ కిషన్‌కి తోడు విరాట్ సింగ్(88), కుమార్ కుష్రగ్(63) అర్ధసెంచరీలతో రాణించారు. భారీ లక్ష్యాన్ని 47.3ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదిం చింది. కర్ణాటక కెప్టెన్ మయాంక్ అగర్వాల్(54), దేవదత్ పడిక్కల్(147) సెంచరీలో రాణించారు. అభిమవ్ మనోహర్(56), ధృవ్ ప్రభాకర్(40) మరో వికెట్ పడకుండా మ్యాచ్‌ను ముగించారు.

**ఢిల్లీ చేతిలో ఆంధ్ర ఓటమి**

బెంగళూరులోని బిసిసిఐ సెంట్రల్ ఎక్సలెన్స్ స్టేడియంలో ఢిల్లీ చేతిలో ఆంధ్రప్రదేశ్ జట్టు 8వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. ఢిల్లీ తరఫున టీమిండియా స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లి బరిలో దిగి శతకంతో రాణించాడు. ఆంధ్ర నిర్దేశించిన 299 పరుగుల లక్ష్యాన్ని ఢిల్లీ జట్టు 37.4 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది. విరాట్ కోహ్లి(131) శతకానికి తోడు ఓపెనర్ ప్రియాన్షు ఆర్యా(74), నితీశ్ రాణా(77) అర్ధసెంచరీలతో రాణించారు. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్రజట్టును కెప్టెన్ రికీ బురు(122) సెంచరీతో ఆదుకున్నాడు. కెప్టెన్ నితీశ్ కుమార్ రెడ్డి(23), ఎం రెడ్డి(27), వరప్రసాద్(28) ఫర్వాలేదనిపించారు. ఢిల్లీ బౌలర్లు సిమ్రన్‌జీత్ సింగ్‌కు ఐదు, ప్రిన్స్ యాదవ్‌కు మూడు వికెట్లు దక్కాయి.

**సకిబుల్ 32బంతుల్లోనే...**

బీహార్ కెప్టెన్ సకిబుల్ గని దేశవాళీ క్రికెట్‌లో తక్కువ బంతుల్లోనే సెంచరీ కొట్టిన బ్యాటర్‌గా రికార్డు పుటల్లోకెక్కాడు. విజరు హజారే వన్డే టోర్నీలో భాగంగా అరుణాచల్‌ప్రదేశ్‌తో బుధవారం జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో గని కేవలం 32 బంతుల్లోనే శతకాన్ని బాదాడు. ఓవరాల్‌గా 40బంతుల్లో 10ఫోర్లు, 12సిక్సర్ల సాయంతో 128పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఇక జార?ండ్ తరఫున ఇషాన్ కిషన్ కేవలం 33 బంతుల్లోనే శతకాన్ని బాదాడు. అంతకుముందు ఈ రికార్డు పంజాబ్ బ్యాటర్ అన్మోల్ ప్రీత్ సింగ్ పేరిట ఉండేది అతడు గత ఏడాది అరుణాచల్‌ప్రదేశ్‌పై కేవలం 34బంతుల్లోనే సెంచరీ కొట్టారు. సకిబుల్ గని, ఇషాన్ కిషన్‌ల దెబ్బకు ఆ రికార్డు తుడిచిపెట్టుకుపోయింది.

**లిస్ట్-ఎ క్రికెట్‌లో తక్కువ బంతుల్లో శతకం బాదిన ఆటగాళ్లు..**

29 : జాక్ ఫ్రేజర్-మెక్ గుర్క్ (దక్షిణాఫ్రికా), తస్మానియాపై, అక్టోబర్ 8, 2023
31 : ఏబీ డివిలియర్స్(దక్షిణాఫ్రికా), వెస్టిండీస్‌పై, జనవరి 18, 2015

**భారత్ తరఫున వేగంగా సెంచరీ కొట్టిన ఆటగాళ్లు..**

32 : సకిబుల్ గని (బీహార్), అరుణాచల్ ప్రదేశ్‌పై, డిసెంబర్ 24, 2025
33 : ఇషాన్ కిషన్ (జార?ండ్), కర్ణాటకపై, డిసెంబర్ 24, 2025
35 : అన్మోల్‌ప్రీత్ సింగ్(పంజాబ్), అరుణాచల్‌ప్రదేశ్‌పై, డిసెంబర్ 21, 2024
36 : వైభవ్ సూర్యవంశీ(బీహార్), అరుణాచల్‌ప్రదేశ్‌పై, డిసెంబర్ 24, 2025
40 : యూసుఫ్ పఠాన్(బరోడా), మహారాష్ట్రపై, ఫిబ్రవరి 16, 2010

# సుళ్లూరుపేట అభివృద్ధిపై ముఖ్యమంత్రితో కీలక భేటీ

**- దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి హామీ**





**నాయుడుపేట- సూర్య వాస్తవం, డిసెంబర్ 24:** అమరావతి సచివాలయంలో గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని సుళ్లూరుపేట నియోజకవర్గ శాసనసభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం గారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో సుళ్లూరుపేట నియోజకవర్గానికి సంబంధించిన పలు కీలక అభివృద్ధి అంశాలపై ముఖ్యమంత్రితో విస్తృతంగా చర్చించారు. నియోజకవర్గంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకువెళ్లగా, వాటి పరిష్కారానికి సానుకూలంగా స్పందించి తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో ముఖ్యంగా తడ మండలం వాటెంబేడు వద్ద గ్రోయిన్ నిర్మాణం, బలోపేతం అంశం, అటకనితిప్ప నుంచి పెర్నాడు వరకు బీటీ రోడ్డు అభివృద్ధి పనులు, చెంగలమ్మ దేవాలయం సమీపంలో కాలంగి నదిపై నూతన వంతెన నిర్మాణం వంటి అత్యంత కీలక సమస్యలపై చర్చ జరిగింది. అదేవిధంగా నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ, ప్రజల అవసరాలకు అనుగుణంగా పథకాల అమలు, పార్టీ కార్యకర్తల సంక్షేమంపై కూడా ముఖ్యమంత్రితో సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. సుళ్లూరుపేట నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపిన ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలబెట్టడమే తమ లక్ష్యమని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు.

# ఎడ్యూసిటీకి 1000 కోట్ల భూమి విరాళం






**విజయనగరం- సూర్య వాస్తవం,**

విశాఖపట్నం - విజయనగరం సరిహద్దుల్లో ఏవియేషన్ ఎడ్యు సిటీ నిర్మాణానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. దీనికి సంబంధించి ఇటీవలే ఒప్పందం కుదిరింది. జీఎంఆర్ గ్రూప్ - మాన్సాస్ ట్రస్టు ఈ ఏవియేషన్ ఎడ్యుసిటీ ఏర్పాటు చేయనున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ప్రాజెక్టు కోసం మాన్సాస్ ట్రస్టు తరుపున రూ.1000 కోట్లు విలువైన 136.63 ఎకరాల భూమిని దానంగా ఇచ్చేందుకు పూసపాటి వంశీయులు అంగీకరించారు. ఈ ప్రాజెక్టుకు తమ వంశీయుడైన అలక్ మహారాజా గజపతి పేరు పెట్టాలని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు కోరుతున్నారు. పూసపాటి వంశీయులు మరోసారి తమ పెద్ద మనసు చాటుకున్నారు. భావితరాల భవిష్యత్ కోసం సుమారు రూ.1000 కోట్లు విలువైన భూమిని దానంగా అందించారు. విశాఖపట్నం - విజయనగరం సరిహద్దుల్లో ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీనిర్మాణానికి ఏపీ ప్రభుత్వం సంకల్పించిన సంగతి తెలిసిందే. జీఎంఆర్ గ్రూప్. మాన్సాస్ ట్రస్టు ఈ ప్రాజెక్టును చేపడుతున్నాయి. ఇటీవలే మంత్రి నారా లోకేష్ సమక్షంలో జీఎంఆర్ - మాన్సాస్ ఎడ్యు సిటీ ప్రాజెక్టుకు ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం 160 ఎకరాల విస్తీర్ణంలో క్యాంపస్ ఏర్పాటు చేయనున్నారు. అయితే ఈ ఏవియేషన్ ఎడ్యు సిటీ కోసం పూసపాటి వంశీయులు రూ.1000 కోట్లు విలువైన భూమిని దానంగా అందించారు. ఈ ఏవియేషన్ ఎడ్యుసిటీ ప్రాజెక్టు కోసం 136.63 ఎకరాలు భూమిని అందించేందుకు మాన్సాస్ ట్రస్టు ముందుకు వచ్చింది. విశాఖ జిల్లా భీమిలి మండలం అన్నవరం వద్ద ఉన్న ఈ భూమిని ఏవియేషన్ ప్రాజెక్టుకు ఇచ్చేందుకు పూసపాటి వంశీయురాలు, అశోక్ గజపతిరాజు కుమార్తె అదితి గజపతిరాజు ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో జీఎంఆర్ - మాన్సాస్ ఎడ్యు సిటీ ప్రాజెక్టుకు పూసపాటి రాజవంశీయుడైన అలక్ మహారాజా గజపతి పేరు పెట్టాలని అదితి గజపతిరాజు కోరారుమరోవైపు విజయనగరం జిల్లా భోగాపురం వద్దఅల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు కూడా తుది దశకు చేరుకున్నాయి. 2026 మే లేదా ఆగస్ట్ నెలల్లో భోగాపురం ఎయిర్‌పోర్టు నుంచి విమానాల రాకపోకలు ప్రారంభించేందుకు విమానయాన శాఖ చర్యలు చేపడుతోంది. అయితే విమానయాన రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా.. భోగాపురం సమీపంలో ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీని ఏర్పాటు చేయాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. ఏవియేషన్ రంగంలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీల బ్రాంచ్‌లను ఇక్కడ ఏర్పాటు చేయించాలని లక్ష్యంయా పెట్టుకుంది. ఇందులో భాగంగానే రైతుల వద్ద నుంచి సేకరించిన భూమి లేదా ప్రభుత్వ భూములలో ఈ ఎడ్యు సిటీని ఏర్పాటు చేయాలని తొలుత నిర్ణయం తీసుకుంది.

# వాజ్ పేయి విగ్రహంతో మొదలు...





**విజయవాడ- సూర్య వాస్తవం, డిసెంబర్ 24:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి విగ్రహాల రాజధానిగా రూపుదిద్దు కుంటోంది. అధికార కూటమిలోని పార్టీలు తమ నాయకులను గౌరవించుకుంటూ భారీ విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. బీజేపీ ఇప్పటికే అటల్, మోదీ సుపరిపాలన యాత్రలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా వాజ్‌పేయీ విగ్రహాలను ఏర్పాటు చేస్తుండగా, అమరావతిలోని వెంకటపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు సమీపంలో ఒక భారీ కాంస్య విగ్రహాన్ని నెలకొల్పనుంది. ఈ విగ్రహ ఆవిష్కరణ ఈ నెల 25న జరగనుందని, కేంద్ర మంత్రి అమిత్ షా హాజరయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.ఔఆంలో కీలక భాగస్వామిగా ఉన్న టీడీపీ ఆధ్వర్యంలోని ఏపీ ప్రభుత్వం.. రాష్ట్ర నూతన రాజధానిలో బీజేపీ దిగ్గజ దివంగత నేత అటల్ బిహారీ వాజ్ పేయీ విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య మరింత సమన్వయం పెరుగుతుందని టీడీపీ భావిస్తోంది. అభివృద్ధి, సమన్వయం, ప్రజాస్వామ్య విలువలతో కూడిన పాలనకు ప్రతిరూపంగా వాజ్‌పేయిని భావిస్తూ.. అదే దిశలో అమరావతిని ముందుకు నడిపించాలన్న సందేశం ఇందులో ప్రతిఫలిస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.వాజ్ పేయీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా వెంకటపాలెంలో ఏర్పాట్ల చేయబోయే వాజ్‌పేయి విగ్రహ ఏర్పాట్లను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీ.వీ.ఎన్. మాధవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాల నేపథ్యంలో అమరావతిలో కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అమరావతిలో ఏర్పాటు చేస్తున్న తొలి విగ్రహం వాజ్‌పేయిదే కావడం గర్వకారణమని చెప్పారు. అందరికీ స్ఫూర్తి, ప్రేరణ కలిగించేలా వాజ్‌పేయి విగ్రహం ఉండబోతుందని మాధవ్ పేర్కొన్నారు. 14 అడుగుల ఎత్తులో కాంస్యంతో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు మాధవ్ వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఢిల్లీలోని ఇతర కార్యక్రమాల కారణంగా హాజరుకావడం లేదని చెప్పారు. అయితే ఢిల్లీ నుంచి పలువురు కేంద్ర నాయకులు ఆవిష్కరణ కార్యక్రమానికి రానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నట్లు మాధవ్ వెల్లడించారు. అమరావతిలో వాజ్‌పేయి విగ్రహం ఏర్పాటు కేవలం ఒక విగ్రహ ఆవిష్కరణ మాత్రమే కాదని, భవిష్యత్ రాజధానికి ఒక ఆలోచనాత్మక ఆరంభమని బీజేపీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు.

# టీడీపీ మీడియా కోఆర్డినేటర్‌గా దబ్బర కుమారస్వామి నాయుడు



**అనంతపురం - సూర్య వాస్తవం, డిసెంబర్ 24:** అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ మీడియా కోఆర్డినేటర్ గా దొబ్బర కుమార్ స్వామి నాయుడు నియమితుల య్యారు. ఈ సందర్భంగా కుమారస్వామి నాయుడు మాట్లాడుతూ.... తెలుగుదేశం పార్టీని ప్రజల్లో తీసుకెళ్లి సోషల్ మీడియా ద్వారా టిడిపి కార్యక్రమాలను ప్రచారం చేస్తాం అన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేస్తానన్నారు.మీడియా కోఆర్డినేటర్ గా ఎంపికైన దబ్బర కుమారస్వామి నాయుడుకు టిడిపి కార్యకర్తలు, అభిమానులు శుభాకాంక్షలు తెలియజేశారు

# సీబీఐ వలలో టిడిపి మాజీ ఎంపీ వారసులు!

**తిరుపతి- సూర్య వాస్తవం, డిసెంబర్ 24:**

దివంగత డీకే ఆదికేశవుల నాయుడు పేరు మరోసారి ప్రముఖంగా వినిపించింది. ఆయన వారసులు సిబిఐ వలలో పడ్డారు. 2019లో జరిగిన రియల్టర్ రఘునాథ్ అనుమానాస్పద మృతి కేసులో ఆది కేశవులు కుమారుడు డీకే శ్రీనివాస్, కుమార్తె కల్పజాను సిబిఐ అధికారులు అరెస్టు చేశారు. వీరితోపాటు అప్పటి డిఎస్పి మోహన్ ను కూడా అదుపులో తీసుకున్నారు. రఘునాథ మృతి వెనుక ఆర్థిక లావాదేవీలు, బెదిరింపులు ఉన్నాయన్న ఆరోపణలపై సుదీర్ఘ దర్యాప్తు కొనసాగింది. అందులో భాగంగానే ఈ అరెస్టులు జరిగాయి. రాజకీయంగా దూరంగా ఉన్న డీకే కుటుంబం ఇప్పుడు ఈ ఘటనతో మళ్లీ వెలుగులోకి వచ్చింది.2019 నాటి కేసు ఇది. డీకే ఆదికేశవులు నాయుడుకు సన్నిహితుడు రఘునాథ్. ఆయన అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. మొదట బెంగళూరు పోలీసులు దర్యాప్తు చేశారు. ఆ తర్వాత బాధితులు హైకోర్టును ఆశ్రయించడంతో దర్యాప్తును సిబిఐ చేశారు. సుప్రీంకోర్టు సైతం సీబీఐ దర్యాప్తునకు ఓకే చెప్పడంతో రంగంలోకి దిగిన అత్యున్నత విచారణ సంస్థ ఈ కేసులో విచారణ చేపట్టింది. అందుకే కీలక అరెస్టులు జరిపినట్లు తెలుస్తోంది. టిటిడి చైర్మన్ పోస్ట్ తో పాటు తిరుపతి ఎంపీగాను పనిచేశారు డీకే ఆదికేశవులు నాయుడు. సుదీర్ఘకాలం టిడిపిలోనే పనిచేశారు.డీకే ఆదికేశవుల నాయుడుకు కర్ణాటకలోవిలువైన ఆస్తులు ఉండేవట. బెంగళూరు తో పాటు ఇతర ప్రాంతాల్లో భారీగా ఆస్తులు ఉండేవని తెలుస్తోంది. మరోవైపు రఘునాథ్ కూడా బెంగళూరు పరిసర ప్రాంతాల్లో స్థితిమంతుడుగా ఉండేవారు. 2013లో ఆదికేశవులు మృతి చెందిన తర్వాత రఘునాథ్ ఆయనకు చెందిన అనేక ఆస్తులను తన ఆధీనంలోకి తీసుకున్నారు. వాటిని తమ పేర్ల మీద బదలాయించాలని.. తండ్రి ఆస్తులకు తాము వారసులమని అప్పట్లో శ్రీనివాస్, కల్పజ, మరికొందరు రఘునాథ్ తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో 2019 మే లో రఘునాథ్ అనుమానాస్పద స్థితి లో మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బెంగళూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే నిందితులుగా ఉన్న ఆది కేశవులు వారసులు పోలీసులపై ఒత్తిడి తెచ్చి దర్యాప్తును నీరుగాచుతున్నారని మృతుడి బంధువులు ఆరోపించారు. ఈ కేసును సిబిఐ కి బదలాయించాలంటూ కర్ణాటక కోర్టుకు ఆశ్రయించారు. సిబిఐ రంగంలోకి దిగడంతో వీరి అరెస్టు జరిగింది. డీకే ఆదికేశవులు టిడిపి నుంచి ఎంపీ అయ్యారు. టీటీడీ చైర్మన్ గాను వ్యవహరించారు.

# ఫోన్ ట్యాపింగ్ లో చిక్కులు తప్పవా

**హైదరాబాద్ - సూర్య వాస్తవం, డిసెంబర్ 24:**

తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు ప్రస్తుతం కీలక మలుపు తిరిగింది. విచారణ జరుపుతున్న ప్రత్యేక దర్యాప్తు బృందం తన దూకుడును పెంచడంతో, ఈ వ్యవహారం ఇప్పుడు నేరుగా రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావుల ముంగిటకు చేరినట్లు కనిపిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో జరిగినట్లుగా ఆరోపణలు వస్తున్న ఫోన్ ట్యాపింగ్ ఉదంతం కేవలం ఒక క్రైమ్ కేసుగానే కాకుండా, రాజకీయ భూకంపంగా మారింది. సీనియర్ ఐపీఎస్ అధికారి సజ్జనార్ నేతృత్వంలోని సిట్ బృందం పకడ్బందీగా ఆధారాలు సేకరిస్తోంది. ఇటీవల కీలక నిందితుడు, మాజీ నిఘా విభాగం చీఫ్ టి. ప్రభాకర్ రావు విచారణలో వెల్లడించిన అంశాలు ఇప్పుడు గులాబీ బాస్ చుట్టూ ఉచ్చు బిగించేలా ఉన్నాయి.అప్పటి ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకే విపక్ష నేతలు, వ్యాపారవేత్తలు, చివరకు సొంత పార్టీలోని అసంతృప్త నేతల ఫోన్లను కూడా ట్యాపింగ్ చేసినట్లు దర్యాప్తులో తేలింది. ముఖ్యంగా విదేశాల నుంచి విచారణకు సహకరిస్తున్నట్లు చెబుతున్న ప్రభాకర్ రావు, అప్పటి ప్రభుత్వంలోని అగ్రనేతల సూచనల మేరకే ఈ వ్యవస్థ నడిచినట్లు కీలక సమాచారం అందించినట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో నిధుల మళ్లింపును పర్యవేక్షించడానికి, ప్రతిపక్షాల వ్యూహాలను చిత్తు చేయడానికి ఈ ట్యాపింగ్ పరికరాలను వాడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం మారబోతోందని తెలిసిన వెంటనే ఇంటెలిజెన్స్ కార్యాలయంలోని హార్డ్ డిస్క్‌లను ధ్వంసం చేయడం ఈ కేసులో అతిపెద్ద నేరంగా పరిగణించబడుతోంది.అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, సిట్ అధికారులు మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావులకు నోటీసులు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేశారు. త్వరలోనే రాజకీయంగా ఎలాంటి అడ్డంకులు లేకుండా నోటీసులు జారీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభాకర్ రావుతో పాటు ఇతర నిందితుల స్టేట్‌మెంట్లలో వీరి పేర్లు ప్రస్తావనకు రావడంతో, అసలు ఈ నిర్ణయాల వెనుక ఎవరున్నారు? దీనికి నిధులు ఎక్కడి నుండి వచ్చాయి? అనే కోణంలో ప్రశ్నలు సిద్ధం చేసినట్లు సమాచారం.ఈ పరిణామాలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ సానుకూలంగా స్పందించారు. "చట్టం ఎవరికీ చుట్టం కాదు, తప్పు చేసిన వారు ఎంతటి వారైనా శిక్ష అనుభవించాల్సిందే" అని ఆయన వ్యాఖ్యానించారు. నిజానిజాలు వెలుగులోకి రావాలని, బాధితులకు న్యాయం జరగాలని ఆయన డిమాండ్ చేశారు. ఇది కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ యుద్ధంలా కాకుండా, ప్రజల వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన అంశంగా బీజేపీ చిత్రీకరిస్తోంది.ఈ కేసు కేవలం నోటీసులతో ఆగిపోతుందా లేదా అరెస్టుల వరకు వెళ్తుందా అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ కేసును లాజికల్ ఎండ్‌కు తీసుకెళ్లాలని పట్టుదలతో ఉంది. ఇది రాజకీయ కక్ష సాధింపు అని బీఆర్ఎస్ వాదిస్తున్నప్పటికీ, సాంకేతిక ఆధారాలు బలంగా ఉంటే తప్పించుకోవడం కష్టమే. ధ్వంసం చేసిన హార్డ్ డిస్క్‌ల నుండి రికవరీ చేసిన డేటా, నిందితుల మధ్య జరిగిన వాట్సాప్ చాట్స్ ఈ కేసులో కీలకం కానున్నాయి.తెలంగాణ రాజకీయ చరిత్రలో ఇదొక చీకటి అధ్యాయంగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. ప్రజాస్వామ్యంలో వ్యక్తిగత గోప్యతను హరించడం క్షమించరాని నేరం. ఒకవేళ సిట్ సేకరించిన ఆధారాలు కోర్టులో నిలబడితే, బీఆర్ఎస్ అగ్రనాయకత్వం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోక తప్పదు. వచ్చే కొన్ని వారాలు తెలంగాణ రాజకీయాల్లో అత్యంత కీలకం కానున్నాయి.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )